తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | ఆదివారం-07-సెప్టెంబర్- 2025 | సంపుటి : 3 | సంచిక : 102 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in



## కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారు

- పదేళ్లలో కల్వకుంట్ల కుటుంబం భారీ అవినీతికి పాల్పడిరదన్న పొంగులేటి
- కమీషన్లు రావనే డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టలేదని ఆరోపణ
- రూ. 8.19 లక్షల కోట్ల అప్పుల భారం మోపారని మండిపాటు
- పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తే భారీగా కమీషన్లు వస్తాయన్న దురాలోచనతోనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆ ప్రాజెక్టును చేపట్టారని, అదే పేదలకు ఇళ్లు కట్టిస్తే కమీషన్లు రావన్న కారణంతో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేశారని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. కల్వకుంట్ల కుటుంబం వారి పదేళ్ల పాలనలో భారీ అవినీతికి పాల్పడిరదని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.

మిగతా 2లో

# హుస్సేన్ సాగర్‌లో బడా గణేశ్ నిమజ్జనం

కనివినీ ఎరుగని రీతిలో భక్తజనం ఘనంగా వీడ్కోలు
ఎన్టీఆర్ మార్గ్ వద్ద ఏర్పాటు చేసిన బాహుబలి క్రేన్‌తో నిమజ్జనం
వేలాది భక్తులు 'గణపతి బప్పా మోరియా' అని పెద్ద ఎత్తున నినాదాలు



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ఖైరతాబాద్ మహా గణపతికి నభూతో నభవిష్యతి అనేలా కనివినీ ఎరుగని రీతిలో భక్తజనం ఘనంగా వీడ్కోలు పలికారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ మార్గ్ వద్ద ఏర్పాటు చేసిన బాహుబలి క్రేన్ పాయింట్ 4 దగ్గర బడా గణపతి నిమజ్జనం అనుకున్న సమయానికే ప్రశాంతంగా ముగిసింది. వేలాది భక్తులు 'గణపతి బప్పా మోరియా' అని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ.. మళ్లీ తిరిగి రావయ్యా వినాయకా.. అంటూ వైభవోపేతంగా సాగనంపారు. నిమజ్జనానికి ముందు ఉత్సవ సమితి సభ్యులు శాస్త్రోక్తంగా తుదిపూజలు నిర్వహించారు. ఈ ఏడాది 69 అడుగుల

మిగతా 2లో



### సామాన్యుడిలా వచ్చి భక్తుల మధ్య చేరి

- పరిమిత వాహనాలతో సాదాసీదాగా వచ్చిన రేవంత్ రెడ్డి
- ట్రాఫిక్ క్లియరెన్స్ లేకుండా సామాన్యుడిలా నిమజ్జన ప్రక్రియ పరిశీలన

2లో



## హైదరాబాద్‌లో డ్రగ్స్ ఫ్యాక్టరీ సీజ్

- రూ.12 వేల కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం
- భారీగా కొనసాగుతోన్న డ్రగ్స్ దందా
- మేడ్చల్ జిల్లాలో డ్రగ్స్ తయారీ యూనిట్ గుట్టురట్టు

2లో

## కవిత పోరాటానికి మద్దతుగా ఉంటాం : బీసీ నేతలు

- బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ మోసం చేస్తోందని కవిత విమర్శ
- బిల్లులకు ఆమోదం కోసం ప్రభుత్వం కనీసం ప్రయత్నించలేదని మండిపాటు
- 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు ఉద్యమం ఆగదన్న కవిత



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను దారుణంగా మోసం చేస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేయడం లేదని, చట్టసవరణ పేరుతో నాటకాలాడుతోందని ఆమె ఆరోపించారు.

మిగతా 2లో


## ట్రంప్ వ్యాఖ్యలను అభినందించిన మోదీ

- ట్రంప్ ప్రశంసలకు మోదీ సమాధానం
- ఇరు దేశాల వ్యూహాత్మక బంధంపై మోదీ స్పందన
- మోదీ ట్వీట్‌తో అపోహలకు ముగింపు
- అమెరికా–భారత్ స్నేహానికి కొత్త బలమైన హామీ
- ట్రంప్ వ్యాఖ్యలపై మోదీ క్లారిటీ

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన తాజా వ్యాఖ్యలపై భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ట్రంప్ భావాలను, ఇరు దేశాల సంబంధాలపై సానుకూల దృక్పథాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు.

7లో





## తెలంగాణలో విద్యా వ్యవస్థ అధఃపాతాళంలోకి పోతుంది

- రేవంత్ రెడ్డి గారూ మేల్కొనండి
- బీఆర్ఎస్ సీనియర్ లీడర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ సీనియర్ లీడర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిప్పులు చెరిగారు. తెలంగాణలో విద్యా వ్యవస్థ అధఃపాతాళంలోకి పోతుందని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. సాంఘిక సంక్షేమ గురుకుల కాలేజీల్లో ఇప్పటికీ పాఠ్య పుస్తకాలు అందలేదు. ఈ అంశంపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. విద్యాసంవత్సరం ప్రారంభమై నేటి మూడు నెలలైంది. అయినా చాలా కాలేజీల్లో ఇప్పటికీ పాఠ్య పుస్తకాలు రాలేదని విద్యార్థులు రోదిస్తున్నారు.

మిగతా 2లో



## సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్‌సూద్‌కు అస్వస్థత

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్‌సూద్ అస్వస్థత చెందారు. నిన్న కాళేశ్వరం కేసుపై అధికారులతో సమావేశం అయిన ప్రవీణ్ సూద్.. సమావేశం అనంతరం శ్రీశైలం వెళ్లారు. అయితే, శ్రీశైలం నుండి వస్తుండగా ఉన్నట్టుండి ఆయన అనారోగ్యానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో ఆయనను హుటాహుటిన హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అపోలో ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. సమాచారం తెలియడంతో ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు సీబీఐ సీనియర్ అధికారులు అపోలో ఆస్పత్రికి చేరుకుని పరామర్శించారు. ప్రస్తుతం ఆయనకు వైద్యులు అన్ని అవసరమైన పరీక్షలు చేస్తున్నారు. అస్వస్థతకు గల కారణాలపై పూర్తి సమాచారం ఇంకా వెల్లడి కాలేదు.

## బీఆర్ఎస్ కీలక భేటీ..

- కవిత ఆరోపణలపై చర్చలు
- కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో నాలుగు గంటల నుంచి చర్చలు
- బీఆర్ఎస్ ఎలాంటి ప్రకటన చేస్తోంది అనే దానిపై సర్వాత్ర ఉత్కంఠ

2లో



## గుజరాత్‌లో రోప్‌వే దుర్ఘటన – ఆరుగురి మృతి

- పంచమహల్ రోప్‌వే వైర్లు తెగి ఆరుగురి ప్రాణాలు బలై
- పావగఢ్ కొండపై రోప్‌వే విషాదం
- నిర్మాణ సామగ్రి తరలింపు సమయంలో రోప్‌వే ప్రమాదం
- గుజరాత్ రోప్‌వే ప్రమాదంపై ప్రభుత్వం విచారణ ఆదేశాలు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

గుజరాత్‌లోని పంచమహల్ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. కార్గో రోప్‌వే కేబుల్ వైర్లు తెగిపోవడంతో ఆరుగురు మృతిచెందారు. ఆధ్యాత్మిక కేంద్రం పావగఢ్ కొండపైకి రోప్‌వేలో నిర్మాణ సామగ్రి తరలిస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. శనివారం మధ్యాహ్నం 3:30 గంటల ప్రాంతంలో కార్గో రోప్‌వే ట్రాలీ, కొండపైకి నిర్మాణ సామాగ్రిని తరలిస్తున్న క్రమంలో నాలుగో టవర్ నుండి కేబుల్స్ తెగిపోవడంతో

మిగతా 7లో



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక



# హైదరాబాద్‌లో డ్రగ్స్ ఫ్యాక్టరీ సీజ్

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

హైదరాబాద్ కేంద్రంగా భారీగా డ్రగ్స్ దందా కొనసాగుతోంది అనడానికి ఈ ఫ్యాక్టరీనే ఉదాహరణ. వేల కోట్ల రూపాయల్లో డ్రగ్స్ దందా చేస్తున్నట్లు తేలింది. బంగ్లాదేశ్‌కు చెందిన డ్రగ్స్‌తో మహారాష్ట్ర పోలీసులకు పట్టుబడడంతో.. ఆమెను విచారించగా ఈ డ్రగ్స్ తయారీ యూనిట్ వెలుగులోకి వచ్చింది. హైదరాబాద్ కేంద్రంగా ఈ ఫ్యాక్టరీ నుంచి ఇప్పటికే కొన్ని వేల కోట్ల డ్రగ్స్ బిజినెస్ జరిగినట్లు తెలుస్తుంది. తాజాగా జరిపిన దాడుల్లో రూ. 12 వేల కోట్ల విలువైన డ్రగ్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని, ఆ ఫ్యాక్టరీని సీజ్ చేశారు. మేడ్చల్ జిల్లాలో డ్రగ్స్ తయారీ యూనిట్ గుట్టురట్టు అయింది. డ్రగ్స్ తయారీ యూనిట్‌పై మహారాష్ట్ర క్రైమ్ బ్రాంచ్ పోలీసులు దాడి చేశారు. ఎండీ డ్రగ్స్ తయారీలో వినియోగించే 32 వేల లీటర్ల ముడి సరుకును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మిథైలెనెడియాక్సీ, మెథాంఫెటమైన్ వంటి ముడి పదార్థాలను సీజ్ చేశారు. ఈ ఫ్యాక్టరీలో తయారైన డ్రగ్స్ వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నట్లు తేలింది. దేశంతో పాటు విదేశాలకు కూడా ఎండీ డ్రగ్స్‌ను సరఫరా చేసినట్లు గుర్తించారు. ఎక్స్‌టాసీ, మోలీ, ఎక్స్‌టీసీ పేర్లతో డ్రగ్స్‌ను నిందితులు సరఫరా చేస్తున్నారు. డ్రగ్స్ తయారీ యూనిట్‌కు చెందిన 13 మందిని అరెస్టు చేశారు. ఈ ముఠా నుంచి సుమారు రూ. 12,000 కోట్ల విలువైన నిషేధిత మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నారు. గత నెలలో మహారాష్ట్ర పోలీసులకు బంగ్లాదేశ్‌కు చెందిన ఫాతిమా డ్రగ్స్‌తో పట్టుబడిరది. ఆమె నుంచి రూ. 25 లక్షల విలువైన డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆమె ఇచ్చిన సమాచారంతో మహారాష్ట్ర క్రైమ్ బ్రాంచ్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పక్కా సమాచారంతో ఇవాళ మేడ్చల్‌లో దాడులు చేసి.. భారీగా డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.

# హుస్సేన్ సాగర్‌లో బడా గణేశ్ నిమజ్జనం

(మొదటి పేజీ తరువాయి)

ఎత్తుతో శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతిగా ఖైరతాబాద్ బడా గణపతి భక్తులకు దర్శనమిచ్చాడు.

69 అడుగుల ఎత్తు, 28 అడుగుల వెడల్పుతో ఉన్న ఈ విగ్రహం విశేషంగా ఆకట్టుకుంది. ఇది ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవాల 71వ సంవత్సరం. కోట్లాది మంది భక్తులను నవరాత్రుల్లో బడా గణేషుని దర్శనం చేసుకుని పరవశించిపోయారు. తొమ్మిది రోజుల పూజల అనంతరం సరిగ్గా ఉదయం 7 గంటలకు ఖైరతాబాద్ గణేషుని శోభాయాత్ర ఆరంభమైంది. వెల్డింగ్ వర్క్, టెలిఫోన్ భవన్, తెలుగు తల్లి ఫ్లైఓవర్, సచివాలయం, ఎన్టీఆర్ మార్గ్ మీదుగా వినాయకుడి రథయాత్ర కన్నులపండువగా సాగింది. మధ్యాహ్నం 12 గంటల కల్లా ట్యాంక్ బండ్ చేరుకుంది. సుమారు 70 అడుగుల భారీ క్రేన్ సాయంతో ఖైరతాబాద్ గణపతిని నెమ్మదిగా ఎత్తి, భక్తుల నినాదాల మధ్య హుస్సేన్ సాగర్‌లో గంగమ్మ ఒడికి చేర్చారు. నగరవ్యాప్తంగా ఉన్న వేలకొద్దీ గణనాథులు గంగమ్మ ఒడికి చేరుకునేందుకు రహదారులపై బారులు తీరారు. దీంతో హుస్సేన్ సాగర్, ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాలు జనసంద్రాన్ని తలపించాయి. మహాగణపతితో పాటు అనేక వినాయక విగ్రహాలు ఒకేసారి దర్శించుకుని భక్తులు పులకించిపోయారు. 'గణపతి బప్పా మోరియా' నినాదాలతో గణపయ్యను కీర్తిస్తూ నినాదాలు చేశారు. 'జై జై గణేశా... బై బై గణేశా' అంటూ ఏకదంతునికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ అపుర్వ ఘట్టాన్ని వేలాది మంది ప్రజలు స్వయంగా వీక్షించగా.. కోట్లాది మంది టెలివిజన్‌లు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ప్రత్యక్షంగా చూసి పరవశించిపోయారు. ఇక, ఖైరతాబాద్ శోభాయాత్ర జరిగే మార్గంలో ముందుగానే పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. పటిష్ఠమైన భద్రత చర్యలు చేపట్టడంతో బాహుబలి క్రేన్ నంబర్ 4 వద్ద నిమజ్జన కార్యక్రమం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా ప్రశాంతంగా ముగిసింది.







# సామాన్యుడిలా వచ్చి భక్తుల మధ్య చేరి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ట్రాఫిక్ మళ్లింపులు, క్లియరెన్స్ లేకుండా పరిమిత సంఖ్యలో వాహనాలతో సాదాసీదాగా నలుగురైదుగురు వ్యక్తిగత సిబ్బందితో ట్యాంక్ బండ్ వద్దకు వచ్చిన ముఖ్యమంత్రి గారు అక్కడ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. భక్తుల మధ్య చేరిపోయి ఏర్పాట్లు ఎలా ఉన్నాయని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గణపతి బొప్పా... మోరియా.. అంటూ పెద్ద ఎత్తున భక్తుల నినాదాలు మారుమోగుతున్న వేళ.. ముందస్తు సమాచారం లేకుండా సాదా సీదాగా అక్కడికి చేరుకున్న ముఖ్యమంత్రి గారు భాగ్యనగర్ ఉత్సవ సమితి వేదిక పైకి ఎక్కి అశేషంగా తరలివచ్చిన భక్తులకు అభివాదం చేశారు. అదే క్రమంలో క్రేన్ నంబర్ 4 వద్దకు వెళ్లి నిమజ్జన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఉదయం నుంచే శోభాయాత్ర ప్రారంభమై ఒక్కొక్కటిగా గణపతులు ట్యాంక్‌బండ్ తరలుతుండగా, సాయంత్రానికి మహా గణపతి శోభాయాత్ర ఊపందుకుంది. ఆ సమయంలో ఒక సాధారణ వ్యక్తిలా ముఖ్యమంత్రి గారు ఆ మహా జనంలో కలిసిపోయి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులతో కరచాలనం చేస్తూ ముందుకు నడిచారు. హుస్సేన్‌సాగర్‌లో ఎన్టీఆర్ మార్గ్, ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్ (పీవీ మార్గ్) లో నిరాటంకంగా సాగుతున్న నిమజ్జన కార్యక్రమం ఏర్పాట్లలో పాల్గొన్న సిబ్బందిని అభినందించారు. నిమజ్జనాలు పూర్తయ్యే వరకు అదే స్ఫూర్తితో పని చేయాలని చెప్పారు.



# కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారు

(మొదటి పేజీ తరువాయి)



శనివారం వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మంగంపల్లిలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని రూ. 8.19 లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టిందని విమర్శించారు. ఆ అప్పులకు తమ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతినెలా వడ్డీలు కడుతూనే, మరోవైపు సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళుతోందని స్పష్టం చేశారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, పేదలను కేవలం ఓటు బ్యాంకుగానే చూసిందని పొంగులేటి ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 7 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు, పాత కార్డులలో 17 లక్షల మంది పేర్లను చేర్చామని గుర్తుచేశారు. బీఆర్ఎస్ సర్కారు ఏటా రెండు వేల ఇళ్లు కట్టినా పదేళ్లలో అర్హులందరికీ ఇళ్లు అందేవని, కానీ వారికి ఆ చిత్తశుద్ధి లేదని విమర్శించారు. రాబోయే రోజుల్లో మూడు విడతలుగా రాష్ట్రంలోని అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారునికి ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు నిర్మించి ఇస్తామని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డితో పాటు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# కవిత పోరాటానికి మద్దతుగా ఉంటాం : బీసీ నేతలు

(మొదటి పేజీ తరువాయి)

శనివారం బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో పలువురు బీసీ సంఘాల నాయకులు కవిత సమక్షంలో జాగృతిలో చేరారు. జీహెచ్ఎంసీ మాజీ కార్పొరేటర్ గోపు సదానందం, సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోల శ్రీనివాస్, అరెకటిక సంఘం నేత సురేందర్ తమ అనుచరులతో కలిసి జాగృతి తీర్థం పుచ్చుకున్నారు. 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం కవిత చేస్తున్న పోరాటానికి మద్దతుగా తాము ఈ నిర్ణయం తీసుకున్నామని వారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయకుండానే స్థానిక సంస్థల ఎన్నికలకు



వెళ్లాలని ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదించిన 42 శాతం రిజర్వేషన్ల బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం పొందేందుకు ఈ ప్రభుత్వం కనీస ప్రయత్నం చేయలేదని ఆరోపించారు. ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళతామని అసెంబ్లీలో హామీ ఇచ్చి మాట తప్పారని గుర్తు చేశారు. ఒకవైపు కేంద్రం వద్ద బిల్లులు పెండిరగ్‌లో ఉండగా, మరోవైపు కేబినెట్ తీర్మానం చేసి గవర్నర్‌కు పంపడం బీసీలను మభ్యపెట్టడానికేనని ఆమె అన్నారు. గవర్నర్ బిల్లులను తొక్కిపెట్టినా, ప్రభుత్వం న్యాయపోరాటం చేసి ఒత్తిడి తెచ్చే ప్రయత్నం కూడా చేయలేదని విమర్శించారు. విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు తమ ఉద్యమం ఆగదని కవిత స్పష్టం చేశారు. త్వరలోనే బీసీ సంఘాల నాయకులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని ఆమె వెల్లడిరచారు.



# తెలంగాణలో విద్యా వ్యవస్థ అధఃపాతాళంలోకి పోతుంది

(మొదటి పేజీ తరువాయి)

ఇందుకోసమేనా తమరు విద్యాశాఖను తమరి దగ్గరనే పెట్టుకున్నారా..? మీ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి దిశగా దూసుకుపోవడం లేదు.. ఇది నిజం.. అగాథంలోకి తెలంగాణ పోతుందని ఆర్ఎస్పీ పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ఇప్పటికైనా మేల్కొనాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సూచించారు.

# బీఆర్ఎస్ కీలక భేటీ..

సిద్దిపేట, (తెలంగాణ ముచ్చట్లు):

ఎర్రవల్లిలోని మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో నాలుగు గంటల నుంచి చర్చలు కొనసాగుతున్నాయి. మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేసీఆర్ భేటీ అయిన విషయం తెలిసిందే. ఈ సమావేశంలో తాజా రాజకీయ పరిస్థితులపై చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. హరీష్ రావుపై మాజీ ఎమ్మెల్సీ కవిత చేసిన ఆరోపణలపై ఆసక్తికర చర్చ జరుగుతున్నట్లు సమాచారం. కాళేశ్వరం ప్రాజెక్టును సీబీఐకి ప్రభుత్వం అప్పగించిన విషయంపై ఆదివారం కూడా సమావేశాలు కొనసాగే అవకాశం ఉంది. కొద్దిసేపటి క్రితమే.. ఫామ్ హౌస్ నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వెళ్లినట్లు సమాచారం. అయితే.. ఫామ్ హౌస్‌లోనే హరీష్‌రావు, కేటీఆర్ ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు రేపటి సమావేశాల తరువాత మీడియా సమావేశం లేదా ప్రకటన విడుదల చేసే అవకాశం ఉంది. అయితే మాజీ ఎమ్మెల్సీ కవిత చేసిన ఆరోపణలపై తాజాగా మాజీ మంత్రి హరీష్ రావు స్పందించిన విషయం తెలిసిందే. తన రాజకీయ జీవితం తెరిచిన పుస్తకమని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో తన నిబద్ధత అందరికీ తెలుసునని చెప్పుకొచ్చారు. ప్రజల ఆకాంక్షల మేరకే పనిచేయాల్సిన బాధ్యత తనపై ఉందని నొక్కిచెప్పారు. తెలంగాణ అభివృద్ధిలో ఓ కార్యకర్తలాగా తాను పాతికేళ్లు పనిచేశానని వ్యాఖ్యానించారు. తనపై, పార్టీపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తనపై చేసిన ఆరోపణలను వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని పేర్కొన్నారు. తనపై దిగజారుడు రాజకీయాలు మంచిది



కాదని హరీష్‌రావు హితవు పలికారు. ఈ నేపథ్యంలో ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో నిర్వహిస్తున్న సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే సమావేశాల అనంతరం బీఆర్ఎస్ ఎలాంటి ప్రకటన చేస్తోంది అనే దానిపై సర్వాత్ర ఉత్కంఠ నెలకొంది.

# మరో 20 ఏళ్ల పాటు కాంగ్రెస్ అధికారంలో కొనసాగుతుంది

◆ **ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**వనపర్తి,సెప్టెంబర్6(తెలంగాణ ముచ్చట్లు):**




వనపర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. శనివారం పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "మరో 20 సంవత్సరాలు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుంది. ప్రతి కార్యకర్త గ్రామం, మండల స్థాయిలో చురుకుగా పాల్గొని ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ చేరవేయాలి" అని పిలుపునిచ్చారు.

"కాంగ్రెస్ బలోపేతానికి పాత, కొత్త అనే తేడా లేదు. అందరూ ఒకే నినాదం - జై కాంగ్రెస్ - తో ముందుకు సాగాలి. నేటి నుంచి ప్రతి కార్యకర్త సోషల్ మీడియా వారియర్‌గా పని చేయాలి. మనం చేసే ప్రతి చిన్న పనిని ప్రజలకు తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత" అని ఎమ్మెల్యే సూచించారు.

వనపర్తిలో అభివృద్ధి పనులు

గత 20 నెలల్లో వనపర్తి నియోజకవర్గంలో రూ.1759 కోట్ల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు.

నియోజకవర్గంలో త్వరలోనే 6 కొత్త సింగిల్ విండోలు, 2 వ్యవసాయ మార్కెట్ యార్డులు ఏర్పాటు కానున్నాయి.

విద్యా రంగంలో కేంద్రీయ విద్యాలయం, నవోదయ, వెటర్నరీ కళాశాల, పాలిటెక్నిక్ పునరుద్ధరణ, స్పోర్ట్స్ స్కూల్, టర్ఫ్ హాకీ మైదానం, స్విమ్మింగ్ పూల్, జిమ్నాసియం, 7 వెటర్నరీ ఆసుపత్రులు ఏర్పాటు కానున్నాయి.

హాం ప్రాజెక్టు ద్వారా రహదారుల బలోపేతం జరగనుందని తెలిపారు.

గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం జీవోలకే పరిమితమై నిధులు కేటాయించలేదని విమర్శించారు. "వనపర్తి నియోజకవర్గ అభివృద్ధికి నేను ఎల్లప్పుడూ కృషి చేస్తాను. మాట తప్పే అవకాశం లేదు" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులనే గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు మార్కెట్ యార్డ్ అధ్యక్షురాలు ప్రమోదిని రెడ్డి, పీసీసీ సభ్యులు శంకర ప్రసాద్, జిల్లా మహిళా అధ్యక్షురాలు శ్రీలత రెడ్డి, మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, విజయవర్ధన్ రెడ్డి, మండల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ జెడ్పిటిసి, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటీసీలు, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.







## మినీ శిల్పారామం లో కూచిపూడి నృత్య ప్రదర్శన

**ఉప్పల్, సెప్టెంబర్ 06 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ మినీ శిల్పారామం వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం సాయంత్రం ప్రేరణ ప్రతిభ డాన్స్ ఇన్స్టిట్యూట్ గురువు కుమారి అమీ కుమార్ శిష్య బృందం అందించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది.

ఓం గణనాదయ, బ్రహ్మాంజలి, దేవా దేవం భజే, వార వీణ, ముందుక శబ్దం, దేవి శక్తి, స్వరపల్లవి, హిందువుల తిల్లాన, మంగళం అంశాలను శిష్యులు శ్రావ్యంగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమం లో నయోనికా, సంహిత, హర్షిని, లహరి, జాన్వీ, కృష్ణ, ఇషాని, శివాని, ఐశ్వర్య, తేజు, రిషిక, హిందుజా తదితర కళాకారులు తమ నైపుణ్యంతో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. కళాకారుల సమన్వయం, భంగిమలు, భావప్రకటనలకు సభలో హాజరైనవారు ప్రశంసలు కురిపించారు.



## దశాబ్ది మహాగణపతి ఉత్సవాల్లో బహుమతి ప్రధానోత్సవం మాజీ కౌన్సిలర్ అనంతరెడ్డి

**నాగారం, సెప్టెంబర్ 06(తెలంగాణ ముచ్చట్లు)**

పారామౌంట్ ఐవెన్యూ - నాగారం మున్సిపాలిటీ లో శిల్పనగర్ ప్రాంతంలో దశాబ్ది మహాగణపతి నవరాత్రి ఉత్సవాలు పిఎంఎ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. నవరాత్రులను పురస్కరించుకొని ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలను నిర్వహించారు .ఈ క్రమంలో 11వ పూజ అనంతరం బహుమతి ప్రధానోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 6వ వార్డు మాజీ కౌన్సిలర్ కౌకుంట్ల అనంతరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సత్కారాన్ని స్వీకరించారు. అనంతరం ఆయన విజేతలకు బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా పిఎంఎ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన అధ్యక్షుడు కాసారం నవీన్ కుమార్ గౌడ్, కార్యదర్శి సోమ కిరణ్ కుమార్ గుప్త, కోశాధికారి బివి సుబ్బారావు, కె. అనిల్ కుమార్, వి. జయచంద్ర, డి. కృష్ణచైతన్య తదితరులు మాట్లాడుతూ, ఈ దశాబ్ది మహాగణపతి ఉత్సవాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన ప్రతి పిఎంఎ కుటుంబ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

## వైభవంగా మహారాజు యువసేన గణనాథుడి శోభాయాత్ర

**కీసర, సెప్టెంబర్ 6 (తెలంగాణ ముచ్చట్లు):**

కీసర గ్రామంలోని కాముని కంత మహారాజ్ యువసేన ఆధ్వర్యంలో గణనాథుడి శోభాయాత్ర అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామమంతా భక్తి శ్రద్ధలతో అలరారగా గణనాథుని విగ్రహాన్ని భక్తులు నృత్యాలు, భక్తి గీతాలతో ఊరేగిస్తూ నిమజ్జన మండపానికి తరలించారు.ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన లడ్డు వేలంపాట భక్తుల ఉత్సాహానికి నిదర్శనమైంది. దాన్నోళ్ల రాంబాబు భారీ మొత్తానికి లడ్డును కైవసం చేసుకోగా, పండ్లను తుడుం కిషోర్ దక్కించుకున్నారు. వేలంపాటలో గ్రామ ప్రజలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు. తరువాత నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్యేక అతిథులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. గణనాథుడి శోభాయాత్రలో సాంప్రదాయ వాద్య బృందాలు, బ్యాండ్ మేళాలు, డప్పులు, సాంస్కృతిక నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.గ్రామంలోని ప్రతి వీధి, ప్రతి కూడలి గణనాథుని నినాదాలతో మారుమ్రోగింది. భక్తులు "గణనాథ శుభ యాత్ర"ని ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు మహారాజ్ యువసేన సభ్యులకు గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.



## 85 వేలకు లడ్డూ వేలంలో దక్కించుకున్న అంగులూరి బబ్లూ

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 6 ,తెలంగాణ ముచ్చట్లు:**






ఖమ్మం నగరంలోని 57వ డివిజన్లో ఏర్పాటుచేసిన శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ మండప వద్ద నవరాత్రులు పూజ చేసుకున్న లడ్డును వేలంపాటలో అంగులూరి బబ్లు అనే వ్యక్తి ఏకంగా 85వేలకు పాడుకున్నాడు. సవరాల కాలనీలో ఏర్పాటుచేసిన శ్రీ సాయి గణేష్ ఉత్సవ కమిటీ 9 వసంతాలు పూర్తి చేసుకుని పదవ వసంతంలోకి అడుగు పెట్టింది. గణేష్ లడ్డూలు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కమిటీ సభ్యులు 85 వేల వరకు పాడుతూ పోటీపడ్డారు. కాగా అంగులూరి బబ్లు 85 వేలకు లడ్డూలు దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా అంగులూరి బబ్లు మాట్లాడుతూ... వినాయకుడి లడ్డూ వేలంపాటలో ప్రతి ఏడు పాల్గొంటానని, ఈ ఏడు ఎలా అయినా లడ్డూను దక్కించుకోవాలని 85 వేలకు పాడుకున్నట్లు తెలిపాడు. 85 వేలకు లడ్డును దక్కించుకున్న లడ్డూ కుటుంబ సభ్యులను కమిటీ సభ్యులు శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, డివిజన్ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## గాయపడిన దంపతులకు సాయం చేసిన రాచకొండ సీపీ సుధీర్ బాబు

**మేడ్చల్ మల్కాజ్గిరి, సెప్టెంబర్ 6 (తెలంగాణ ముచ్చట్లు)**

మహా గణేష్ నిమజ్జనోత్సవ ఏర్పాట్లతో బిజీగా ఉన్న రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు మానవత్వం చాటుకున్నారు.శనివారం ఉదయం బాలాపూర్ గణనాథుడిని దర్శించుకోవడానికి వెళ్తున్న దంపతులు మల్లాపూర్ ఆర్‌సీఐ రోడ్ వద్ద బైక్ నియంత్రణ కోల్పోయి పడిపోయారు. ఈ ఘటనలో వారికి గాయాలయ్యాయి. అదే సమయంలో అక్కడ గుండా వెళ్తున్న సీపీ సుధీర్ బాబు సంఘటనను గమనించారు. వెంటనే వాహనాన్ని ఆపి తన సిబ్బంది సహాయంతో గాయపడిన వారికి ప్రథమ చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. తరువాత వారు క్షేమంగా వెళ్లే వరకు పర్యవేక్షించిన సీపీ మానవత్వాన్ని చూసి అక్కడి స్థానికులు ప్రశంసలు కురిపించారు.




## ఉప్పల్ గణేష్ ఉత్సవసమితి ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనం

**ఉప్పల్, సెప్టెంబర్ 6 (తెలంగాణ ముచ్చట్లు)**

గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఉప్పల్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గాంధీ బొమ్మ వద్ద ఏర్పాటు చేసిన మహా గణనాధుని మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి గణనాధుని దర్శించుకుని పూజలు చేశారు.ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, "విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తున్నాను" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి నాయకులు ముస్తి ప్రభాకర్, మంద సుమన్ రెడ్డి, అన్ రెడ్డి రాజీ రెడ్డి, పాలకుర్తి ప్రవీణ్, లింగాల ఐలేష్, వేణు మహంకాళి, సంతోష్, రామ్, బుచ్చి రెడ్డి, ప్రవీణ్, ప్రశాంత్ రెడ్డి, శ్రీదర్, విక్రమ్ గౌడ్, రాజేష్, లక్ష్మణ్, మేకల రాఘవేందర్ రెడ్డి, దీపు గౌడ్, చింటు కాలనీ అసోసియేషన్ సభ్యులు, వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి స్వాగత వేదికను సందర్శించిన కార్పొరేటర్ బన్నాల

**చిల్కానగర్, సెప్టెంబర్ 6 (తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ నియోజకవర్గం చిల్కానగర్ డివిజన్ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ సభ్యురాలు బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి (ఉప్పల్ శాఖ) ఏర్పాటు చేసిన స్వాగత వేదికను శనివారం సందర్శించారు.ఈ సందర్భంగా గీతా ప్రవీణ్ మాట్లాడుతూ, "పవిత్రమైన 11 రోజుల పాటు పూజలు అందుకొని నిమజ్జనానికి బయలుదేరిన గణనాథులకు స్వాగత వేదిక ద్వారా ఆతిథ్యం ఇవ్వడం విశేషం. మండప నిర్వాహకులకు మంచినీళ్లు, పులిహోర పొట్లాలు అందిస్తూ భక్తులకు సేవలందిస్తున్న గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు అభినందనీయులు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రత్యేకత ఏంటంటే సమాజంలోని అందరినీ ఏకం చేసి ఐక్యతను చాటుతుంది" అని అభిప్రాయపడ్డారు .ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కమిటీ సభ్యులు రెడ్డి దేవేందర్ రెడ్డి, ఈగ సంతోష్ ముదిరాజ్, కోకొండ జగన్, చిలుకూరి శ్రీకాంత్, విటల్, వినోద్, బొమ్మల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ ను పరామర్శించిన బిఆర్ఎస్ నాయకులు

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 6, తెలంగాణ ముచ్చట్లు;**



అనారోగ్యంతో బాధపడుతున్న చింతకాని మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు కోమట్ల గూడెం మాజీ సర్పంచ్ వేముల నర్సయ్య ని శనివారం శనివారం తన స్వగ్రామం కోమట్ల గూడెం గ్రామంలో చింతకాని బిఆర్ఎస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో పరామర్శించడం జరిగినది పరామర్శించిన వారిలో చింతకాని మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పెంట్యాల పుల్లయ్య బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు మంకెన రమేష్ బొడ్డు వెంకటరామయ్య రాయల శ్రీనివాస రావు నన్నక కోటయ్య పోనుగోటి రత్నాకర్ పాపినేని రంగారావు గడ్డం శ్రీనివాసరావు శీలం సీతా రెడ్డి బొగ్గారపు శీను ఎరమల అప్పిరెడ్డి ఆవులూరి లచ్చిరెడ్డి కొండూరు పరిశుద్ధ రావు అంకాలు నెంబర్ వెంకటేశ్వర్లు వేముల సీతారాములు మరియు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# జ్ఞాన దీపస్తంభాలుగా నిలిచే గురువులు

- డా. జిల్లెల చిన్నారెడ్డి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు

**వనపర్తి,సెప్టెంబర్6(తెలంగాణ ముచ్చట్లు):**

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వనపర్తి కలెక్టరేట్ లో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా. జిల్లెల చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "విద్యార్థి సందేహాలను తీర్చుతూ, లక్ష్య సాధనకు మార్గనిర్దేశం చేసే గురువు మహోన్నత దీపస్తంభం" అని అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ గారి జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు. రాధాకృష్ణ గారు ఉపాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్రపతిగా ఎదిగిన తీరు ప్రతి ఒక్కరికీ ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు.

వనపర్తి నియోజకవర్గంలో ఒకప్పుడు వలసలు అధికమై నిరక్షరాస్యత ఎక్కువగా ఉన్నా, ప్రాజెక్టులు, విద్యాసంస్థలు తెచ్చి వనపర్తిని 'విద్యాపర్తి'గా తీర్చిదిద్దామని చిన్నారెడ్డి గుర్తుచేశారు. గణితం, ఆంగ్లంపై ప్రత్యేక శ్రద్ధ పెడితే విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతారని ఉపాధ్యాయులకు సూచించారు.

"ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వనపర్తిలో విద్యాభ్యాసం చేశారు కాబట్టి ఇక్కడి విద్యాభివృద్ధికి అవసరమైన సౌకర్యాలు తప్పక లభిస్తాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు కృషి చేస్తే వనపర్తికి రాష్ట్ర స్థాయి అవార్డులు రావడం ఖాయం" అని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

వనపర్తి జిల్లాలో ఉన్న 90 ప్రభుత్వ పాఠశాలల్లో గత సంవత్సరం 32 శాతం మాత్రమే ఉన్న మెరిట్ శాతం ఈ ఏడాది 50 శాతానికి పెరగాలని ఉపాధ్యాయులను కోరారు.

ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 62 మందిని శాలువా కప్పి, ప్రశంసా పత్రాలు, షీల్డులు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయురాలు గాయత్రి మేడం ప్రసంగం ఆకట్టుకోగా, విద్యార్థుల ఆటపాటలు అందరిని అలరించాయి.

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి, జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, రాష్ట్ర మైనార్టీ నాయకులు కమర్ మియా, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చీర్ల జనార్ధన్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు సమద్ మియా, పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బాబా, పెద్దమందడి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటన్న యాదవ్, జానంపేట నాగరాజు, వాకిటి బాలరాజ్, రాగి వేణు, యూత్ కాంగ్రెస్ నాయకులు ఇర్ఫాన్, చందు తదితరులు పాల్గొన్నారు.



# అల్వాల్‌లో గణేష్ లడ్డూ రికార్డు ధర

- 1,15 వేలకు సొంతం చేసుకున్న యాదవ గొర్ల కాపర్లు

**వనపర్తి,సెప్టెంబర్6(తెలంగాణ ముచ్చట్లు):**


పెద్దమందడి మండలం అల్వాల్ గ్రామంలో శుక్రవారం శ్రీకృష్ణ యాదవ్ కమిటీ యూత్ ఆధ్వర్యంలో గణేష్ విగ్రహ విసర్జన ఘనంగా జరిగింది. గ్రామ యువత, యాదవ సోదరులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.


విసర్జనలో ప్రధాన ఆకర్షణగా విఘ్నేశ్వరుడి ప్రసాద లడ్డు వేలం నిలిచింది. ఈ వేలంలో యాదవ గొర్ల కాపరులు అద్భుత పోటీ చూపించి, ₹1,15,000కి లడ్డూను సొంతం చేసుకుని గ్రామంలో కొత్త రికార్డు సృష్టించారు. అలాగే గణేశుని పంచ, పండు ₹20,000కి పెద్ద గొల్ల నక్క తిరుపతయ్య యాదవ్ దక్కించుకున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా లక్కీ లడ్డు కోసం టోకెన్ల ద్వారా కార్యక్రమం నిర్వహించగా, గౌనికాడి మల్లేష్ యాదవ్ అదృష్టం సొంతం చేసుకున్నారు.

ఇంత పెద్ద మొత్తంలో లడ్డు వేలం జరగడం గ్రామ చరిత్రలో ఇదే తొలిసారి కావడంతో శ్రీకృష్ణ యాదవ్ కమిటీ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో గోపాలకృష్ణ యాదవ సంఘం అధ్యక్షుడు గూడెం భీమన్న యాదవ్, ఉపాధ్యక్షుడు పసుల సాయిలు, కమిటీ సభ్యులు నక్క కృష్ణ యాదవ్, నక్క సతీష్ యాదవ్, టంకరి రమేష్ యాదవ్, నందిపేట రాజు యాదవ్, నక్క ఉదయ్ యాదవ్, టంకరి రాజు యాదవ్, ఏర్పుల ఉదయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. విసర్జన సందర్భంగా ఎవరికైనా అసౌకర్యం కలిగినట్లయితే క్షమించవలసిందిగా నిర్వాహకులు అభ్యర్థించారు.





# కాలనీలో గణనాథుని మండపాల సందర్శన చేసిన ఎమ్మెల్యే, కార్పొరేటర్

**మల్కాజిగిరి, సెప్టెంబర్ 6 (తెలంగాణ ముచ్చట్లు)**

వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. గౌతమ్‌నగర్ డివిజన్ పరిధిలోని దయానంద్‌నగర్, గౌతమ్‌నగర్, మల్లికార్జుననగర్, గోపాల్‌నగర్, జ్యోతినగర్, మిర్జాలగూడ, ఇందిరా నెహ్రూ నగర్, రామాంజనేయనగర్ తదితర కాలనీలలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని అలరించాయి.ఈ ఉత్సవాల సందర్భంగా మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి, గౌతమ్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీతా, స్థానిక నాయకులు రాము యాదవులు పలు మండపాలను సందర్శించి గణనాథుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, "గణనాథుని ఆశీర్వాదాలతో ప్రజలందరూ ఆరోగ్యంగా సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నాను. భక్తి, ఐకమత్యం, సాంస్కృతిక విలువలకు ప్రతీకగా ఈ ఉత్సవాలను జరుపుకోవాలి" అని పేర్కొన్నారు. కార్పొరేటర్ మేకల సునీతా మాట్లాడుతూ, "ప్రతి కాలనీలో గణనాథుని మండపాలు భక్తుల ఉత్సాహంతో నిండిపోతున్నాయి. స్థానికులు చూపిస్తున్న శ్రద్ధ అభినందనీయమైనది" అన్నారు.మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానాలు, శోభాయాత్రలతో వాతావరణం పండుగలా మారింది. ప్రజలు కుటుంబ సమేతంగా విచ్చేసి గణనాథుని దర్శించుకుంటూ పూజలు చేస్తున్నారు.



# నాయుడు పేటలో నిమజ్జన మహోత్సవం ఘనంగా

**2ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 6, తెలంగాణ ముచ్చట్లు:**

నాయుడు పేట మున్నేరు పరివాహక ప్రాంతంలో నిమజ్జన మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు ఏదులాపురం మున్సిపాలిటీ అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక పహారా ఏర్పాటు చేసి సాయంత్రం నుంచి అర్ధరాత్రి వరకు సజావుగా నిమజ్జన కార్యక్రమం కొనసాగింది.

మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి స్వయంగా పర్యవేక్షణ చేయడంతో భక్తులు నిశ్చింతగా నిమజ్జనంలో



పాల్గొన్నారు. ప్రతి మూలలో పోలీసు బందోబస్తు, లైటింగ్, తాగునీటి సదుపాయాలు, వైద్య శిబిరం వంటి ఏర్పాట్లు ఉండటంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

"ఇంత చక్కగా ఏర్పాట్లు చేసినందుకు మాకు ఎటువంటి ఇబ్బంది కలగలేదు" అంటూ భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. నిమజ్జన ఘట్టం మొత్తం పండుగ వాతావరణంలో సాగింది.





# ఇందిరమ్మ ఇళ్లతో ప్రజా పాలనకు నాంది

- మంగంపల్లిలో ఘనంగా ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం
- రాష్ట్ర మంత్రులు పొంగులేటి,జూపల్లి, వాకిటి శ్రీహరి

**పెద్దమందడి,సెప్టెంబర్6(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామంలో ఘనంగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎక్సైజ్, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, క్రీడా, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, స్థానిక ఎమ్మెల్యే టి. మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి పాల్గొని ఇళ్లను ప్రారంభించారు.

మంత్రులు తెలిపారు, గత పాలకులు రాష్ట్రంపై ₹819 లక్షల కోట్లు అప్పులు పెడుతూ వెళ్లిపోయినా, ప్రభుత్వం ప్రతి నెల వడ్డీ చెల్లిస్తూ అభివృద్ధి-సంక్షేమాన్ని జోడెద్దుల్లా ముందుకు తీసుకెళ్తోంది. ప్రజల కోసం ఇప్పటికే ఆర్టీసీ ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ₹500కి గ్యాస్ సిలిండర్, రూ.21 వేల కోట్లతో రైతు రుణమాఫీ వంటి పథకాలు అమలు చేస్తోందన్నారు. రైతు పట్ల గౌరవం చూపిస్తూ అదనంగా ప్రతి క్వింటాల్‌కు ₹500 బోనస్ కూడా ఇస్తున్నామని చెప్పారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల హామీ ఇచ్చి నిలబెట్టుకోలేకపోయిన గత ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, ప్రస్తుత ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్లను ₹22,500 కోట్లతో నిర్మిస్తోంది అని మంత్రులు స్పష్టం చేశారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి పనితీరును ప్రశంసిస్తూ, నిజాయితీగా పనిచేసే అధికారులను ప్రోత్సహిస్తామని, దురుద్దేశంతో పనిచేసే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, అదనపు కలెక్టర్ బీమ్యా నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ పి. శ్రీనివాస్ గౌడ్, వనపర్తి మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షుడు కె. రామకృష్ణ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# నాగపూర్ గ్రామ బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ లో చేరిక

**వనపర్తి,సెప్టెంబర్6(తెలంగాణ ముచ్చట్లు):**

రేవల్లి మండలం నాగపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన 15 మంది నాయకులు, కార్యకర్తలు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు తమను ఆకట్టుకున్నాయని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని వారు తెలిపారు.

రేవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వాడల పర్వతాలు, ఉమ్మడి గోపాలపేట మండల ఇన్‌ఛార్జ్ సత్యశీలారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వనపర్తి ఎమ్మెల్యే గౌరవ శ్రీ తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి కొత్తగా చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

"గత 10 ఏళ్లుగా బీఆర్ఎస్ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నేడు ఇందిరమ్మ రాజ్యంలో అభివృద్ధి కోసం, గ్రామ ప్రజలతో కలిసి పనిచేయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నాం" అని కొత్తగా చేరిన నేతలు పేర్కొన్నారు.

కార్యక్రమంలో గ్రామ నాయకులు వేణు, చెన్నకేశవులు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# ఐరాస సమావేశానికి మోడీ దూరం

భారీ సుంకాల విధింపు నేపథ్యంలో భారత్‌అమెరికా సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో భారత్ కీలక నిర్ణయం తీసుకుంది. అమెరికాలో జరగనున్న ఐరాస జనరల్ అసెంబ్లీ సమావేశాలకు ప్రధాని మోడీ హాజరు కావడం లేదని తెలుస్తోంది. సెప్టెంబరు 9 నుంచి ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 80వ సెషన్ ప్రారంభమవుతుంది. 23 నుంచి 29 వరకు సర్వసభ్య దేశాల ప్రతినిధుల అత్యున్నత స్థాయి సమావేశాలు జరుగుతాయి. ఇందులో బ్రెజిల్ దేశాధినేత ప్రసంగంతో సమావేశాలు మొదలవుతాయి. అనంతరం అమెరికా అధినేత డొనాల్డ్ ట్రంప్ మాట్లాడతారు. తర్వాత భారత మంత్రి ప్రసంగం ఉంటుందని ఐరాస తన షెడ్యూల్‌లో పేర్కొంది. దీని ప్రకారం యూఎన్ సమావేశాలకు మోడీ దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన స్థానంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ప్రసంగించనున్నారని సమాచారం. ఇది తుది షెడ్యూల్ కానందున సమావేశాల ప్రారంభానికి ముందు కొన్ని మార్పులు జరిగే అవకాశం ఉంది. ఇజ్రాయెల్, చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ దేశాధినేతలు కూడా సమావేశాల్లో ప్రసంగించనున్నారు. ట్రంప్ ఇటీవల భారత్‌పై 50 శాతం సుంకాలు విధించారు. దీంతో ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో మోడీ యూఎన్ సమావేశాలకు కూడా దూరం కానుండటం గమనార్హం.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# డిజిటల్ లింగ భేదం,మహిళల ఆర్థికాభివృద్ధి పై వరంగల్ ఎంపీ ప్రజెంటేషన్

హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:

గోవా రాష్ట్రంలో ఫ్రిడిక్ ఎబర్ట్ స్టిఫ్టుంజ్ ఇండియా సంస్థ నిర్వహించిన సదస్సులో శనివారం వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొని డిజిటల్ లింగ భేదం - మహిళల ఆర్థికాభివృద్ధి అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు.

ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ చిన్న, మధ్యతరగతి ఆదాయం కలిగిన దేశాల్లో మహిళలు పురుషుల కంటే 8 శాతం తక్కువగా మొబైల్ ఫోన్లు కలిగి ఉన్నారని, స్మార్ట్‌ఫోన్ వినియోగంలో 13 శాతం తేడా ఉన్నట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 405 మిలియన్ల మంది మహిళలు ఇంకా డిజిటల్ ప్రపంచానికి చేరుకోలేదని, దీని వల్ల మహిళల విద్య, ఆరోగ్య సేవలు, ఆర్థిక స్వావలంబనలో ఆటంకాలు ఏర్పడుతున్నాయని వివరించారు. భారతదేశంలో




75 శాతం మహిళలకు మాత్రమే మొబైల్ ఫోన్లు ఉండగా, స్మార్ట్‌ఫోన్ వినియోగం కేవలం 35 శాతం వరకు మాత్రమే ఉందని పేర్కొన్నారు.

మహిళల శక్తి ప్రతీకగా వరంగల్ ప్రాంత చరిత్రలోని రాణీ రుద్రమదేవి నాయకత్వం, సమ్మక్క-సారలమ్మ పూజల వంటి ఉదాహరణలను ప్రస్తావించారు.తాజా పరిస్థితులలో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న పథకాలను వివరించిన ఆమె, ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు, వడ్డీ లేని రుణాల మంజూరు, మహిళా సంఘాలకు రూ.344 కోట్ల రుణాల విడుదల, ఆరోగ్యసేవలలో రూ.10 లక్షల వరకు సౌకర్యం, నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం వంటి చర్యలు మహిళా సాధికారత దిశగా ముందడుగని పేర్కొన్నారు.



డిజిటల్ లో అసమానతలు తగ్గించేందుకు తక్కువ ధరలో మొబైల్ పరికరాలు అందించడం, డిజిటల్ విద్య, మౌలిక వసతుల పెంపు అవసరమని సూచించారు. ఈ దిశగా ప్రభుత్వం గణనీయ కృషి చేస్తోందని వివరించారు. సదస్సులో తమిళనాడు ఎంపీ ఆర్. సుధ, ఎమ్మెల్యే పర్ణికా రెడ్డి తోపాటు పలువురు మహిళా నాయకులు పాల్గొన్నారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం.. నెలాఖరు వరకు విస్తారంగా వర్షాలు

బంగాళాఖాతంలో ఈ నెల 13న అల్పపీడనం ఏర్పడే అవకాశముందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. ఇది పశ్చిమవాయవ్య దిశగా ఏపీ, ఒడిశా, తెలంగాణ వైపు కదిలే అవకాశముందని, దీని ప్రభావంతో ఈ నెలాఖరు వరకు తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురవొచ్చని పేర్కొంది. మరోవైపు రాబోయే 4 రోజుల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు పడొచ్చని అమరావతి వాతావరణ విభాగం తెలిపింది. శుక్రవారం అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో వేడి, ఉక్కపోత పెరిగింది. కాకినాడ, నరసాపురం, మచిలీపట్నం, గన్నవరం, బాపట్ల, కావలి, నెల్లూరు తదితర ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 4 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. రాబోయే బుధ, గురువారాల్లో ఉత్తర కోస్తా, రాయలసీమలోని కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు ఉంటాయని చెప్పింది.

# మావోయిస్టులు, జవాన్ల మధ్య కాల్పులు

**రాయ్‌పూర్ :** భారీ వర్షాల కారణంగా కొంత విరామం ఇచ్చిన తర్వాత బస్తర్ ప్రాంతంలో మావోయిస్టులను తుదముట్టించేందుకు భద్రతా బలగాల కార్యకలాపాలు మళ్ళీ ఉధృతమయ్యాయి. నారాయణ్‌పూర్, దంతెవాడల మధ్య శుక్రవారం ఉదయం నుంచి హోరాహోరీగా పోరు సాగుతోంది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇప్పటివరకు ఆరుగురు మావోయిస్టులు మరణించారని భావిస్తున్నారు. ఈ సంఖ్య పెరిగే అవకాశముంది. అబుజమద్ ఏరియాలోని అడవుల్లో కీలకమైన సమావేశం కోసం మావోయిస్టులు పెద్ద సంఖ్యలో సమావేశమైనట్టు తమకు సమాచారం అందిందని సీనియర్ పోలీసు అధికారులు తెలిపారు. ఈ సమాచారం అందిన వెంటనే డ్రాగన్ రైజింగ్ గ్రూప్ (డీఆర్‌జీ) సైనికులను అక్కడకు పంపారు. ఉదయం 9గంటల ప్రాంతంలో సైనికులు, మావోయిస్టుల మధ్య కాల్పులు ఆరంభమయ్యాయి. దీనిపై ఎస్పీ గౌరవ్ రాయ్ మాట్లాడుతూ, పోలీసులు వస్తున్న విషయం తెలియగానే మావోయిస్టులు అడవిలోకి పారిపోయారని తెలిపారు. ఆ తర్వాత ఇరు పక్షాల నుంచి కాల్పులు మొదలయ్యాయని చెప్పారు. ఇంకా కాల్పులు కొనసాగుతున్నాయన్నారు.



# సుప్రీంను ఆశ్రయిస్తాం ఉమర్ ఖలీద్‌కు బెయిల్ నిరాకరణపై కపిల్ సిబల్

న్యూఢిల్లీ : ఢిల్లీ అల్లర్ల కేసులో ఉమర్ ఖలీద్‌కు ఢిల్లీ హైకోర్టు బెయిల్ నిరాకరించిన నేపథ్యంలో సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ స్పందిస్తూ ఈ అన్యాయానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు. రాజకీయంగా తమకు హాని కలుగుతుందని భావించి, ఇలాంటి అంశాలను రాజకీయ పార్టీలు లేవనెత్తనపుడు, భారతదేశ ప్రజాస్వామ్యం ఎక్కడికి వెళుతోందని ఆయన ప్రశ్నించారు. ఖలీద్ తరపు న్యాయవాది ఏడుసార్లు వాయిదాలు కోరారని మాజీ సీజేఐ డి.వై.చంద్రచూడ్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. ఈ అంశం సుప్రీంకోర్టు ముందున్నపుడు కేవలం రెండుసార్లే వాయిదా కోరారని చెప్పారు. ''ఏండ్ల తరబడి కోర్టు తీర్పు ఇవ్వకపోతే, అందుకు లాయర్లను నిందిస్తున్నారు. ఇది కోర్టుల్లోని పరిస్థితి. మీరు బెయిల్ ఇవ్వాలనుకోకపోతే వెంటనే తిరస్కరించండి, ఎందుకు 20, 30సార్లు విచారణలు జరుపుతారు?'' అని సిబల్ ఇక్కడ ఒక పత్రికా సమావేశంలో ప్రశ్నించారు.

# కట్టుదిట్టమైన భద్రత మధ్య ప్రశాంతంగా కొనసాగుతున్న గణేష్ నిమజ్జనం: పోలీస్ కమిషనర్

ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 6, తెలంగాణ ముచ్చట్లు:

కట్టుదిట్టమైన పోలీసు భద్రత మధ్య జిల్లాలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర ప్రశాంతంగా కొనసాగుతోందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. పోలీసు, విద్యుత్ , మున్సిపల్ , ఆర్ & బి, వైద్య, పంచాయతీ, ఫైర్ ,రెవెన్యూ, మత్యాశాఖ తదితర శాఖల అధికారుల ప్రణాళికాబద్ధంగా చేపట్టిన చర్యలతో ఇప్పటికే వందలాది వినాయక విగ్రహాలు గంగమ్మ ఒడిని చేరాయని తెలిపారు.

శోభాయాత్ర ప్రారంభమైన అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, నగరపాలక కమిషనర్ అభిషేక్ అగస్త్య కల్వోడ్డు మున్నేరు ఘాట్ ను సందర్శించారు.

శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సం



ఘటనలు చోటు చేసుకోకుండా భారీ ఎత్తున పోలీసు బలగాలను మోహరించి అడుగడుగునా యాత్ర సాగుతున్న తీరును సీనియర్ పోలీసు అధికారులు అడిషనల్ డీసీపీలు ప్రసాద్ రావు లు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ కిందిస్థాయి సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్నామని తెలిపారు.

ప్రతి గణేష్ మండపానికి పోలీసు శాఖ వరుస సంఖ్య కేటాయించగా అందుకు అనుగుణంగా రూట్ మ్యాప్ అనుసరించి పోలీసులు సూచించిన ప్రకారం శోభాయాత్రలో విగ్రహాలు ముందుకు సాగుతున్నాయని అన్నారు. శాంతి భద్రతల విఘాతం కలగకుండా ముందుగానే ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా సుమారు 500 మంది పోలీసులతో భారీ బందోబస్తు కొనసాగుతుందని పెర్కొన్నారు. సామన్య ప్రయాణికులకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలలో వెళ్లేందుకు వీలుగా ట్రాఫిక్ పోలీస్ సిబ్బందితో పకడ్బందిగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రకాష్ నగర్, కాల్వ వోడ్డు మున్నేరు వద్ద అడిషనల్ డీసీపీ కుమారస్వామి, విజయబాబు బందోబస్త్ పర్యవేక్షిస్తున్నారు.

# సెప్టెంబర్ 10 రైతు సదస్సును జయప్రదం చేయండి

**– సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి**

ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 6, తెలంగాణ ముచ్చట్లు:

సంయుక్త కిసాన్ మోర్చ (ఎస్ కె ఎం) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 10న ఖమ్మం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రం లో జరిగే రైతు అవగాహన సదస్సును జయప్రదం చేయాలని సిపిఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం చింతకాని మండలం నాగిలిగొండ లో జరిగిన రైతు సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ పత్తి దిగుమతి సుంకం 11శాతం కొనసాగించాలని, పత్తికి మద్దతు ధర రూ.10,075/ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ఇవ్వాలని, మార్కెఫెడ్ ద్వారా పెసలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రైతులకు యూరియా సరఫరా పెంచాలని డిమాండ్ చేశారు. ఈనెల 10వ తేదీన జరిగే రైతు సదస్సులో రైతు సోదరులందరూ పెద్ద ఎత్తున పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని ఏటా నిధులు తగ్గిస్తూ ఈ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తుందని



తక్షణమే ఈ కుట్రని మానుకోవాలన్నారు. రాష్ట్రంలో రేవంత్ సర్కార్ ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమిలేని వ్యవసాయ కూలీలకీ రూ 12,000, మహాలక్ష్మీ పథకం కింద ప్రతి మహిళకు నెలకు రూ.2500, ఇంటి స్థలాలు లేని వారికి ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరి చేస్తామన్న హామీ లు తక్షణమే అమలు చేయాలనివలు డిమాండ్లతో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయూ) ఆధ్వర్యంలో ఈనెల 8న ఖమ్మం కలెక్టరేట్ వద్ద జరిగే మహాధర్నా లో వ్యవసాయ కార్మికులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ధర్నాని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐకేఎస్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, జిల్లా గౌరవ అధ్యక్షులు ఏపూరి రవీంద్ర బాబు, సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, రైతు సంఘం నాయకులు పావులూరి మల్లిఖార్జునరావు, పదిమల వెంకటనర్సయ్య, ఏపూరి నర్సయ్య, షేక్ చిన్న జాన్, శాఖ కార్యదర్శి చాట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.






# హ్యూమన్ రైట్స్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా 8వ వార్షికోత్సవ మహోత్సవం

ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 6, తెలంగాణ ముచ్చట్లు:

మానవ హక్కుల పరిరక్షణ సంస్థ జాతీయ అధ్యక్షులు సింగమల వెంకటరమణయ్య ఆదేశానుసారం, తెలంగాణ రాష్ట్ర చైర్మన్ దబ్బేటి శ్రీనివాస్ ప్రోత్సాహంతో శనివారం ఖమ్మం జిల్లా కార్యాలయంలో మానవ హక్కుల పరిరక్షణ సంస్థ 8వ వార్షికోత్సవంలో భాగంగా ఖమ్మం జిల్లా చైర్మన్ సంకా గణేష్ కుమార్ , ఆర్గనైజింగ్ సెక్రటరీ చింతల రవి, అధ్యక్షతన వార్షికోత్సవ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కమిటీ సభ్యులు బెస్త సంజీవ రావు ,మోటపోతుల బాబురావు, మరియు స్థానిక 4,5 డివిజన్ల కార్పొరేటర్లు, దండా జ్యోతి రెడ్డి , పల్లెబోయిన చంద్రయ్య, హాజరై సంస్థ అభివృద్ధికి తోడ్పాటును అందిస్తామని విధివిధానాలను చర్చించి ప్రసంగించారు, అనంతరం ముఖ్య సలహాదారులు చిలకమర్తి కనకయ్య, మరియు కమిటీ సభ్యులు ఒకరు ఒకరుగా మాట్లాడుతూ హ్యూమన్ రైట్స్ లో వ్యక్తి హక్కులను ధృవీకరించే 30 అధికరణాలు ఉన్నాయని, అంతర్జాతీయ ఒప్పందాలు, ఆర్థిక బదిలీలు, ప్రాంతీయ మానవ హక్కుల సాధనాలు, జాతీయ రాజ్యాంగాలు తదితర చట్టాలలో మానవ హక్కులకు చోటుకల్పించారని అంతర్జాతీయ మానవ హక్కుల బిల్లును రూపొందించే ప్రక్రియలో ఈ ప్రకటన మొదటి దశ తగిన సంఖ్యలో దేశాలు వాటిని ఆమోదించిన తరువాత 1976లో ఈ బిల్లు అమల్లోకి వచ్చిందన్నారు, అప్పటినుండి, మానవ సేవ చేయదలిచినవారు అనేక పేర్లతో కమిటి లను ఏర్పరచుకొని ప్రభుత్వ అధికారులకు ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తూ మానవ హక్కులను వారికి తెలిపి వారికి రావలసిన హక్కుల కొరకు ఎంతటి వారితోనైనా సంప్రదించే హక్కు కల్పించిందని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కమిటీ సభ్యులు, కొప్పుల రామకృష్ణ , సయ్యద్ ఇమ్రాన్, నీరుడు రాంబాబు, మహిళా చైర్మన్ సుజాత , కరాటే వేణు , మాజీ చైర్మన్ రొడ్డ శివయ్య, అనితా, పద్మ, తదితరులు పాల్గొన్నారు

తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక






# హన్మకొండలో లంబాడీల ఆత్మగౌరవ మార్చ్

- **సెప్టెంబర్ 9న హన్మకొండలో లంబాడీల ఆత్మగౌరవ మార్చ్**
- **ఎస్టీ హక్కులపై కుట్ర చేస్తున్నారంటూ ఆరోపణలు**
- **ఐక్యతతో ముందుకు సాగాలని జేఏసీ పిలుపు**

**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

లంబాడి రిజర్వేషన్ పరిరక్షణ జేఏసీ ఆధ్వర్యంలో లంబాడీల ఆత్మగౌరవ మార్చ్ సెప్టెంబర్ 9న హన్మకొండలో జరగనుంది. ఉదయం 10 గంటలకు నక్కలగుట్ట టాను నాయక్ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు మార్చ్ నిర్వహించనున్నట్లు జేఏసీ రాష్ట్ర సమన్వయకర్తలు తెలిపారు.

ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ సమన్వయకర్తలు గుగులోత్ రాజు నాయక్, ఆంగోత్ వినోద్ లోక్ నాయక్ మాట్లాడుతూ... లంబాడీలు ఎస్టీలు కాదని, దొడ్డదారిన రిజర్వేషన్ పొందుతున్నారనే ఆరోపణలతో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, మాజీ ఎంపీ సోయం బాపూరావు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారని తెలిపారు. నిజానికి లంబాడీలు నిజాం ప్రభుత్వ కాలం నుంచే ఎస్టీ జాబితాలో ఉన్నారని, రాజకీయ ప్రయోజనాల కోసం కుట్ర జరుగుతోందని వారు అన్నారు.

ఈ ఆరోపణలకు ప్రతిస్పందనగా లంబాడీలు ఐక్యంగా నిలిచి తమ హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఆత్మగౌరవ మార్చ్ ద్వారా సంఘటిత శక్తిని ప్రదర్శించబోతున్నామని స్పష్టం చేశారు.

ఈ విలేకరుల సమావేశంలో జేఏసీ స్టీరింగ్ కమిటీ సమన్వయకర్తలు డాక్టర్ చందు నాయక్, లకావత్ రవీందర్ నాయక్, భూక్య రాజు నాయక్, కెలోతు బిక్షపతి నాయక్, అజ్మీర శ్రీరామ్ నాయక్, వాలు నాయక్, సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షులు మురళి నాయక్, మోహన్ నాయక్, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి సంఘాల ప్రతినిధులు భూక్య రమేష్ నాయక్, తిరుపతి నాయక్, అశోక్ నాయక్, ఆలోజి నాయక్, సునీల్ నాయక్, అఖిల్ నాయక్, చందూలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.




# ప్రభావం చూపని జిఎస్‌టి శ్లాబుల తగ్గింపు

వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) శ్లాబుల తగ్గింపు మార్కెట్లలో ఉత్సాహాన్ని నింపలేకపోతోంది. ఆర్థిక వ్యవస్థలో ఉన్న బలహీనతలు, అమెరికా టారిఫ్‌ల భయాలు ఇప్పటికీ ఇన్వెస్టర్లను వెంటాడుతున్నాయి. జిఎస్‌టి శ్లాబులను 5, 12 శాతాలకు తగ్గించడం ద్వారా మార్కెట్లు పరుగులు పెడతాయని ప్రభుత్వ వర్గాలు ఊహించినప్పటికీ.. ఆచరణలో భిన్నంగా ట్రేడిరగ్ అవుతోన్నాయి. గురువారం, శుక్రవారం సెషన్‌లు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాయి. మరోవైపు డాలర్‌తో రూపాయి మారకం విలువ రోజు రోజుకు పడిపోతూ చరిత్రలోనే ఎప్పుడూ లేని కనిష్ట స్థాయి 88.27కు దిగజారింది. విదేశీ సంస్థాగత పెట్టుబడులు తరలిపోవడంతో వారాంతం సెషన్‌లో సెన్సెక్స్, నిఫ్టీలు మిశ్రమంగా నమోదయ్యాయి. బిఎస్‌ఇ సెన్సెక్స్ 7.25 శాతం తగ్గి 80,710.76 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 7 పాయింట్లు పెరిగి 24,641 వద్ద నమోదయ్యింది. ఇంతక్రితం సెషన్‌లోనూ సెన్సెక్స్ 150 పాయింట్ల ర్యాలీతో సరిపెట్టుకుంది. వారాంతం సెషన్‌లో బిఎస్‌ఇలో మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతి సుజుకి, రిలయన్స్ ఇండిస్ట్రీస్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ఉండగా.. ఐటిసి, హెచ్‌సిఎల్ టెక్నాలజీ, టిసిఎస్ షేర్లు అధికంగా నష్టపోయాయి. నిఫ్టీలో మిడ్ క్యాప్ 0.20 శాతం, స్మాల్ క్యాప్ 0.19 శాతం చొప్పున పెరిగాయి. ఆటో రంగం 1.125 శాతం, లోహ రంగం 0.68 శాతం, మీడియా 0.59 శాతం చొప్పున పెరగ్గా.. ఐటి రంగం ఏకంగా 1.44 శాతం నష్టపోయింది. ఇదే బాటలో ఎఫ్‌ఎంసిజి 1.42 శాతం, రియాల్టీ 1.16 శాతం చొప్పున ప్రతికూలతను ఎదుర్కొన్నాయి.




# టాటా కార్లపై రూ. 1.55 లక్షల వరకు తగ్గింపు

తాజాగా ప్రభుత్వం ప్రకటించిన జీఎస్టీ 2.0 రేట్ల తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు బదిలీ చేస్తూ ప్రముఖ వాహన తయారీ సంస్థ టాటా మోటార్స్ శుక్రవారం తన వాహనాలపై భారీ తగ్గింపు వివరాలను ప్రకటించింది. ప్యాసింజర్ వాహనాల ధరలను రూ. 75,000 నుంచి రూ. 1.55 లక్షల వరకు తగ్గించినట్టు తెలిపింది. కొత్త ధరలు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. కంపెనీ అధికారిక వివరాల ప్రకారం, టాటా చిన్న కార్లలో టియాగో మోడల్‌పై రూ. 75 వేలు, టిగోర్‌పై రూ. 80 వేలు, ఆల్ట్రోజ్‌పై రూ. 1.10 లక్షలు తగ్గించింది. కాంపాక్ట్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో పంచ్ కారుపై రూ. 85 వేలు, నెక్సాన్‌పై రూ. 1.55 లక్షలు తగ్గించింది. మిడ్ సైజ్ ఎస్‌యూవీలలో కర్వ్‌పై రూ. 65 వేలు, ప్రీమియం ఎస్‌యూవీ విభాగంలో హారియర్‌పై రూ. 1.40 లక్షలు, సఫారీపై రూ. 1.45 లక్షలు తగ్గించింది. జీఎస్టీ సంస్కరణల ప్రయోజనాలను పూర్తిగా వినియోగదారులకు బదిలీ చేస్తామని టాటా మోటార్స్ ప్యాసింజర్ విభాగం ఎండీ శైలేష్ చంద్ర వెల్లడిరచారు.



# బెంజ్‌కు, హవాయి చెప్పులకు ఒకే పన్ను కుదరదు

ఇటీవల ప్రకటించిన కొత్త జీఎస్టీ సంస్కరణలకు సంబంధించి జాతీయ మీడియాకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. భవిష్యత్తులో 'ఒకే దేశంఒకే రేటు' అంశంపై మాట్లాడుతూ.. భారత ఆర్థికవ్యవస్థ వైధ్యమైనదని, అందరికీ ఒకే పన్ను రేటు అసాధ్యమని స్పష్టం చేశారు. సామాన్యులపై పన్నుల భారాన్ని తగ్గించాలనే లక్ష్యంతో జీఎస్టీ వ్యవస్థలో తాజా సవరణలు తెచ్చినట్టు చెప్పారు. వన్ నేషన్‌వన్ ట్యాక్స్ మంచి ఆలోచన అయినప్పటికీ, ఆచరణలో వీలుపడదు. దేశంలోని పౌరులందరూ ఒకే స్థాయిలో అభివృద్ధి కానప్పుడు ఒకే పన్ను విధానం అమలు చేయడం అన్యాయం అవుతుంది. మెర్సిడెస్ బెంజ్ కారు, హవాయి చెప్పులపై ఒకటే పన్ను విధించడం సాధ్యమేనా? మనదేశ వైవిధ్యానికి అభివృద్ధి చెందిన రంగాలు అధిక పన్నులు కట్టగలవు, మిగిలిన రంగాలకు అధిక పన్నులు భారంగా మారుతాయి. దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించగలిగితేనే ఒకే పన్ను విధానం సాధ్యపడుతుందని ఆర్థిక మంత్రి అభిప్రాయపడ్డారు. అయితే, నిర్మలా సీతారామన్ ఈ ఆలోచనను పూర్తిగా తోసిపుచ్చలేదు. దేశంలోని అన్ని ప్రాంతాల్లో ఆర్థికాభివృద్ధి సమంగా మారితే, అందరి ఆదాయాలు పెరిగినప్పుడు ఏకరీతి జీఎస్టీ రేటు ఆచరణలోకి రావొచ్చని అన్నారు. బహుశా మనదేశం పూర్తిగా అభివృద్ధి చెందినప్పుడు, అది సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ప్రతిపక్షాల నుంచి వస్తున్న విమర్శలను నిర్మలా సీతారామన్ తిప్పికొట్టారు. గతంలో జీఎస్టీ వ్యవస్థను గబ్బర్ సింగ్ ట్యాక్స్ అని హేళన చేశారు. వారే ఇప్పుడు పన్ను సంస్కరణల క్రెడిట్ కోరుకుంటున్నారు. జీఎస్టీ సంస్కరణల వల్ల రాష్ట్రాలకే కాదు కేంద్రానికి కూడా కొంత ఆదాయ నష్టం ఉంటుంది. తమ ప్రభుత్వం పౌరుల అవసరాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఆ తర్వాతే ఆదాయమని అన్నారు. ఈ క్రమంలో జీఎస్టీ 3.0 సంస్కరణలు కూడా ఉంటాయని నిర్మలా సీతారామన్ సంకేతమిచ్చారు. 2017లో జీఎస్టీ 1.0 దేశవ్యాప్తంగా ఒకే దేశంఒకే పన్నునినాదంతో వచ్చింది, తాజాగా జీఎస్టీ 2.0 పన్ను రేట్లను సరళతరం చేసే లక్ష్యంతో తెచ్చాం. భవిష్యత్తులో జీఎస్టీ 3.0 కూడా ఉండొచ్చని అన్నారు. జీఎస్టీ 3.0లో జీఎస్టీ 2.0లో సాధించిన సరళమైన పన్ను నిర్వహణను కొనసాగిస్తూనే, దాన్ని మరింత మెరుగుపరిచేలా చేస్తామని తెలిపారు. మరో మాటలో చెప్పాలంటే.. జీఎస్టీ 3.0 స్థిరమైన, న్యాయబద్ధమైన, మరింత సులభమైన పన్ను వ్యవస్థ ఉండేలా చూస్తామన్నారు. గందరగోళం లేకుండా, చిన్న వ్యాపారులపై భారం పడకుండా పన్నులను సరళంగా ఉంచడమే దీని లక్ష్యమని స్పష్టం చేశారు.

# ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా ఎలాన్ మస్క్..?



ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కొన్నేళ్లలో మరో ఘనత సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎలక్ట్రిక్ కార్ల సంస్థ టెస్లా అనుకున్న లక్ష్యాలకు చేరుకుంటే ప్రతిపాదిత ప్రోత్సాహక ప్యాకేజీ కింద సంస్థ సీఈవోగా ఆయనకు భారీ మొత్తం సమకూరనుంది. దీంతో ఆయన సంపద భారీగా పెరగనుంది. దీంతో ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా చరిత్ర సృష్టించే అవకాశం ఉంది. ప్రపంచంలో అత్యంత సంపన్నుల జాబితాలో ఎలాన్ మస్క్ ఇప్పటికే తొలి స్థానంలో ఉన్నారు. ఎలోన్ మస్క్‌కు టెస్లా భారీ ఆఫర్ ఇచ్చింది. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం, అమెరికన్ కంపెనీ టెస్లా తదుపరి జజుూ గా కొనసాగడానికి, కంపెనీని కొత్త శిఖరాలకు తీసుకెళ్లడానికి ఎలోన్ మస్క్ కు ఇచ్చిన జీతం ఆఫర్ విలువ 1 ట్రిలియన్ డాలర్లు (సుమారు రూ.83,00,000 కోట్లు) అని చెబుతారు. ఇప్పటివరకు చరిత్రలో ఇదే అతిపెద్ద జజుూ జీతం ప్యాకేజీ అవుతుందట. ఈ ఆఫర్ 10 సంవత్సరాలకు అందించింది. కానీ ఈ భారీ మొత్తాన్ని మస్క్‌కు ఒకేసారి ఇవ్వరు. దీని కోసం అతను టెస్లా అనేక రంగాలలో గొప్ప విజయాన్ని సాధించేలా చేయాలి. ముఖ్యంగా కంపెనీ కొత్త "రోబోటాక్సీ" వ్యాపారాన్ని వేగంగా విస్తరించాలి. కంపెనీ మార్కెట్ విలువను నేటి దాదాపు 1 ట్రిలియన్ డాలర్ల నుండి కనీసం 8.5 ట్రిలియన్ డాలర్లకు పెంచాలి. ఈ ప్రణాళిక ప్రకారం, మస్క్ అన్ని లక్ష్యాలను సాధిస్తే అతను మిలియన్ల కొద్దీ టెస్లా షేర్లను పొందుతాడు. దీని వలన కంపెనీలో అతని వాటా 25% కి పెరుగుతుంది. భవిష్యత్తులో కంపెనీ దిశపై బలమైన నియంత్రణను కొనసాగించగలగడానికి టెస్లాలో తనకు అలాంటి వాటా కావాలని ఎలోన్ మస్క్ ఇప్పటికే బహిరంగంగా ప్రకటించాడు. ఈ జీతం ఆఫర్‌ను అతని 2018 ప్యాకేజీతో పోల్చి చూస్తే అది దాదాపు వి50 బిలియన్లు (సుమారు 4 లక్షల కోట్లు). దీనిని ఇటీవల కోర్టు తిరస్కరించింది. కానీ టెస్లా బోర్డు ఇప్పుడు మస్క్‌ను కొత్త, మరింత ప్రభావవంతమైన మార్గాల్లో కంపెనీకి అనుబంధంగా ఉంచడానికి ప్రయత్నిస్తోంది. ప్రత్యేకత ఏమిటంటే ఈ ప్రతిపాదనలో మస్క్ కంపెనీ భవిష్యత్ జజుూ ని ప్లాన్ చేయడంలో చురుకైన పాత్ర పోషించాల్సిన షరతు కూడా ఉంది. ఈ ప్యాకేజీలో చివరి భాగాన్ని పొందడానికి అంటే మస్క్ డబ్బు సంపాదించడానికి మాత్రమే కాకుండా కంపెనీ తదుపరి తరాన్ని సిద్ధం చేయడానికి కూడా దోహదపడాలి.

# కొత్త జీఎస్టీ సంస్కరణలతో ప్రభుత్వానికి రూ. 3,700 కోట్ల నష్టం

వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) సంస్కరణలలో భాగంగా రేట్ల తగ్గింపు ద్వారా ప్రభుత్వానికి రూ. 3,700 కోట్ల ఆదాయ నష్టాన్ని ఏర్పడుతుందని ప్రభుత్వ రంగ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) తాజా నివేదిక పేర్కొంది.ఈ రేట్ల కోత వల్ల ఏడాదిలో రూ. 48,000 కోట్ల నష్టాన్ని ప్రభుత్వం అంచనా వేయగా, వ్యవస్థలో వినియోగంతో పాటు వృద్ధి పుంజుకోవడం మూలంగా అంతిమ నష్టం రూ. 3,700 కోట్లకు పరిమితమవుతుందని ఎస్‌బీఐ నివేదిక తెలిపింది. ఇదే సమయంలో ఆర్థిక లోటుపై ప్రభావం ఉండకపోవచ్చని పేర్కొంది. జీఎస్టీ రేట్లను సవరించడం ద్వారా బ్యాంకింగ్ రంగంలో ఖర్చులు తగ్గుతాయి. ఫలితంగా మొత్తం బ్యాంకింగ్ కార్యకలాపాల్లో సానుకూల ప్రభావం ఉంటుంది. గతంలో నాలుగు శ్లాబులుగా ఉన్న జీఎస్టీ రేట్లు ఉండేవి. అందులో సుమారు 295 రకాల వస్తువులపై 12 శాతంగా ఉన్న జీఎస్టీ 5 శాతానికి దిగొచ్చింది. దీనివల్ల ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రిటైల్ ద్రవ్యోల్బణం 2530 బేసిస్ పాయింట్లు(0.250.3 శాతం) తగ్గుతుందని ఎస్‌బీఐ నివేదిక వివరించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం 202627లో కూడా ద్రవ్యోల్బణం 6575 బేసిస్ పాయింట్లు పడిపోవచ్చని నివేదిక వెల్లడిరచింది.

# భారత్‌లో యాపిల్ రికార్డు స్థాయి అమ్మకాలు




దేశంలో టెక్ దిగ్గజం యాపిల్ అమ్మకాలు రికార్డు స్థాయిలో 9 బిలియన్ డాలర్ల(రూ. 79.44 వేల కోట్ల)కు చేరుకున్నాయి. మొత్తం అమ్మకాల్లో కంపెనీ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ ఐఫోన్ ఎక్కువ వాటాను కలిగి ఉన్నాయి.దీని తర్వాత మ్యాక్‌బుక్ కంప్యూటర్‌లకు కూడా డిమాండ్ భారీగా పెరిగింది. ముఖ్యంగా దేశీయ మార్కెట్లో తన ప్రీమియం స్మార్ట్‌ఫోన్‌లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని కంపెనీ రిటైల్ స్టోర్ల సంఖ్యను వేగంగా పెంచుతోంది. ఇదే సమయంలో స్థానిక ఉత్పత్తిని పెంచడం, విడిభాగాల విషయంలోనూ స్థానికంగా సోర్సింగ్ చేస్తుండటంతో డిమాండ్‌కు తగిన స్థాయిలో మార్కెట్లో ఐఫోన్‌ల లభ్యత అమ్మకాలు గణనీయంగా పెరిగేందుకు దోహదపడ్డాయి. యాపిల్ తయారీకి సంబంధించి భారత్‌కు కీలక కేంద్రంగా ఎంచుకుంటోంది. ప్రస్తుతం ప్రతి ఐదు ఐఫోన్‌లలో ఒకటి భారత్‌లోనే తయారవుతోంది. కంపెనీ చైనాపై ఆధారపడటాన్ని తగ్గించి, మనదేశంలోనే ఐదు ప్లాంట్లలో ఉత్పత్తిని విస్తరించింది. ఈ పరిణామాలే యాపిల్ అమ్మకాలు రికార్డు స్థాయిలో పెరిగేందుకు మద్దతిచ్చాయి. రిటైల్ స్టోర్ల సంఖ్యను పెంచుతూనే, స్థానిక డిమాండ్ ఆధారంగా కంపెనీ భారత మార్కెట్లో మరింత వృద్ధిని సాధించే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

# జీఎస్టీ రేట్ల తగ్గింపుతో రూ.3,700 కోట్ల నష్టం!


**వస్తు సేవల పన్ను (జీఎస్టీ) రేట్ల తగ్గింపునతో ప్రభుత్వం రూ.3,700 కోట్ల ఆదాయం మాత్రమే కోల్పోయే అవకాశం ఉందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) ఓ రిపోర్ట్‌లో తెలిపింది. జీఎస్టీ రేట్ల శ్లాబులను నాలుగు నుంచి రెండుకు తగ్గించడం ద్వారా ఏడాదికి రూ.48వేల కోట్ల నష్టం జరగొచ్చని ప్రభుత్వం ఇటీవల అంచనా వేసిన విషయం తెలిసిందే. పన్నుల తగ్గింపు ద్వారా వినియోగం, వృద్ధి పెరగడంతో నష్టం రూ.3,700 కోట్లకు పరిమితమవుతుందని ఎస్బీఐ తన రిపోర్ట్‌లో పేర్కొంది. ఇది ఆర్థిక లోటుపై ఎటువంటి ప్రభావం చూపదని వెల్లడిరచింది. ఈ నెల 3న జరిగిన జీఎస్టీ కౌన్సిల్ 56వ సమావేశంలో ప్రస్తుతం అమలులో ఉన్న 5, 12, 18, 28 శ్లాబుల స్థానంలో రెండు శ్లాబులను ఎత్తివేసి 5 శాతం, 12 శాతం శ్లాబుల విధానాన్ని ఆమోదిస్తూ నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు విలాస వస్తువులపై 40 శాతం పన్ను విధించాలని నిర్ణయించారు. జీఎస్టీ రేట్ల సవరణలతో**



**బ్యాంకింగ్ రంగానికి వ్యయం తగ్గి, సానుకూల ప్రభావం ఉంటుందని ఎస్బీఐ పేర్కొంది. దాదాపు 295 వస్తువుల జీఎస్టీ రేట్లు 12 శాతం నుంచి 5 శాతం లేదా సున్నాకు తగ్గడంతో ఆ విభాగంలో రిటైల్ ద్రవ్యోల్బణం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 25-30 బేసిస్ పాయింట్లు తగ్గొచ్చని అంచనా. మొత్తం మీద రిటైల్ ద్రవ్యోల్బణం 2026-27 నాటికి 65-75 బేసిస్ పాయింట్లు దిగిరావొచ్చని పేర్కొంది. డిమాండ్ పెరగడంతో మరోవైపు జీడీపీ 0.1-0.2 శాతం పెరగొచ్చని అంచనా వేసింది. రేట్ల తగ్గింపునతో ప్రధానంగా ఎఫ్‌ఎంసీజీ, రిటైల్, ఆటోమొబైల్స్, సిమెంట్, ఇన్సూరెన్స్ రంగాలు లబ్ధి పొందుతాయని విశ్లేషించింది.**

# ట్రంప్ వ్యాఖ్యలను అభినందించిన మోదీ

(మొదటి పేజీ తరువాయి)



ఈ మేరకు ఓ న్యూస్‌ఏజెన్సీ ప్రచురించిన కథనంపై మోదీ తన ఎక్స్ ఖాతా నుంచి స్పందించడం గమనార్హం.

తనను గొప్ప ప్రధాని అంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై మోదీ స్పందించారు. ట్రంప్ భావాలను, ఇరు దేశాల సంబంధాలపై సానుకూల దృక్పథాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు. భారత్, అమెరికా మంచి భవిష్యత్తు, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కలిగి ఉన్నాయని ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారాయన. అంతకు ముందు.. భారత్, రష్యాలు అమెరికాకు దూరం అవుతున్నట్లు అనిపిస్తోందంటూ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. అయితే కొన్నిగంటలకే ఆయన ఆ వ్యాఖ్యలను తోసిపుచ్చుతూ అలాంటిదేం లేదంటూ వ్యాఖ్యానించడం కొసమెరుపు. భారత్‌తో తిరిగి సంబంధాలు మెరుగుపడతాయా? అని రిపోర్టర్ల నుంచి ఎదురైన ప్రశ్నకు ట్రంప్ బదులిస్తూ.. ''భారత్, అమెరికా మధ్య ప్రత్యేక బంధం ఉంది.. ఆందోళన ఏమీ లేదు. రెండు దేశాలు కొన్ని సందర్భాల్లో మాత్రమే విభేదిస్తాయి. నేను ఎప్పుడూ మోదీతో స్నేహంగా ఉంటాను. మోదీ గొప్ప ప్రధాని. కానీ ఈ సమయంలో ఆయన చేస్తున్నది నాకు నచ్చలేదు'' అన్నారు.

ఈ నేపథ్యంలో ఐరాస కీలక సమావేశానికి మోదీ గైర్హాజరు అవుతారనే విషయం తెరపైకి వచ్చింది. దీంతో ట్రంప్ వైఖరికి నిరసనగానే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారని ప్రచారం నడుస్తుండగా.. మోదీ తాజా ట్వీట్‌తో ఇరు దేశాధినేతల మధ్య గ్యాప్ ఏర్పడిందన్న ప్రచారానికి ఫుల్‌స్టాప్ పడినట్లయ్యింది.

# గుజరాత్‌లో రోప్‌వే దుర్ఘటన – ఆరుగురి మృతి

(మొదటి పేజీ తరువాయి)



ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు.

ఈ ఘటనలో మరణించిన వారిలో ముగ్గురు స్థానికులు కాగా, ఇద్దరు కశ్మీర్, ఒకరు రాజస్థాన్‌కు చెందినవారిగా గుర్తించారు. ఈ ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు జరుగుతోందని పోలీసులు వెల్లడించారు. వాతావరణం అనుకూలించకపోవడంతో యాత్రికులను తీసుకెళ్లే ప్యాసింజర్ రోప్‌వే మూసివేశామని.. అయితే నిర్మాణ పనుల కోసం గూడ్స్ రోప్‌వే మాత్రం వినియోగంలో ఉందని పోలీసులు తెలిపారు.

ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక దళం, జిల్లా అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. ప్రభుత్వం.. ఈ ఘటనపై విచారణకు ఆదేశించింది. ట్రాలీ దాని సామర్థ్యానికి మించి సామాగ్రిని తీసుకెళ్ళిందా?, సాధారణ తనిఖీలలో ఏమైనా లోపాలు ఉన్నాయా అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. 1986లో ఈ రోప్‌వేను నిర్మించారు.



## భారత్, రష్యాలను చైనాకు కోల్పోయాం !

తియాన్‌జిన్‌లో ఇటీవల జరిగిన షాంఘై సహకార సదస్సు (ఎస్‌సిఓ) తర్వాత భారత్, రష్యాలను చైనాకు కోల్పోయినట్లుగా కనిపిస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం వ్యాఖ్యానించారు. 'అంధకార చైనాకు భారత్, రష్యాలను కోల్పోయినట్లుగా కనిపిస్తోంది. ఆ మూడు దేశాలకు కలిపి మంచి భవిష్యత్తు వుండవచ్చు' అంటూ ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక అయిన ట్రూత్ సోషల్‌లో పోస్టు చేశారు. దీంతో పాటు ప్రధాని మోడీ, రష్యా, చైనా నేతలు పుతిన్, జిన్‌పింగ్ కలిసి వున్న పాత ఫోటోను కూడా జత పరిచారు. రెండవ ప్రపంచ యుద్ధంలో విజయం సాధించి 80ఏళ్లు అయిన సందర్భాన్ని పురస్కరించుకుని చైనాలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన పుతిన్, ఉత్తర కొరియా నేత కిమ్ జోంగ్ ఉన్‌లతో కలిసి జిన్‌పింగ్ అమెరికాకు వ్యతిరేకంగా కుట్ర పన్నుతున్నారని ఇదివరకే ట్రంప్ నోరుపారేసుకున్న సంగతి తెలిసిందే.



## శ్రీలంకలో ఘోర రోడ్డు ప్రమాదం

శ్రీలంకలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దాదాపు 30 మంది ప్రయాణీకులతో వెళ్తున్న బస్సు కొండపై నుంచి లోయలోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో 15 మంది ప్రయాణీకులు మృతి చెందారు. 16 మంది గాయాలపాలయ్యారు. ఈ విషయాన్ని పోలీసు అధికారి తెలిపారు. ఘటనకు సంబంధించి పోలీసు అధికారి ఫ్రెడ్రిక్ వూట్లర్ తెలిపిన వివరాల ప్రకారం.. ''కొలంబోకి తూర్పున 280 కిలోమీటర్ల దూరంలో వెల్లవాయ పట్టణానికి సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. గురువారం రాత్రి ప్రయాణీకులతో వెళ్తున్న బస్సు అదుపుతప్పి లోయలోకి పడిపోవడంతో 15 మంది ప్రయాణీకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఐదుగురు చిన్నారులతో సహా 16 మంది గాయాలపాలయ్యారు'' అని ఫ్రెడ్రిక్ చెప్పారు. డ్రైవర్ బస్సును అతివేగంతో నడపడంతో అదుపుతప్పి మరొక వాహనాన్ని ఢకొన్నెది. ఆ తర్వాత బస్సు గార్డురెయిల్‌స్‌ను తాకి కొండపై నుంచి బోల్తాపడి లోయలోకి పడిరదని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని వూట్లర్ చెప్పారు. లోయలో పడిన బస్సు పూర్తిగా ధ్వంసమైనట్టు స్థానిక మీడియా ఫుటేజీల్లో కనిపించింది.

## ఇంటి కొనుగోలుపై పన్ను చెల్లించనందుకు బ్రిటన్ డిప్యూటీ ప్రధాని రాజీనామా

బ్రిటన్ డిప్యూటీ ప్రధాని ఏంజెలా రేనర్ శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. ఇటీవల ఒక ఇంటిని కొనుగోలు చేసిన విషయంలో ప్రభుత్వ మంత్రులు పాటించవలసిన నైతిక ప్రమాణాలను ఆమె పాటించలేదని స్వతంత్ర దర్యాప్తులో వెల్లడి కావడంతో ఆమె ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ వేసవికి ముందు ఇంగ్లాండ్‌లోని దక్షిణ తీర ప్రాంతంలోని హోవ్‌లో ఒక అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేసినపుడు తగిన పన్ను చెల్లించలేదని ఆమె బుధవారం



అంగీకరించారు. తాను మంచిగా విశ్వసనీయతతోనే వ్యవహరించానని విచారణ నివేదిక పేర్కొందనీ, కానీ పన్ను విషయంలో మరింత నిర్దిష్టంగా వ్యవహరించడం కూడా కీలకమని భావించిందని చెప్పారు. జరిగిన పొరపాటుకు పూర్తి బాధ్యత వహిస్తున్నానని చెబుతూ ఆమె తన రాజీనామా లేఖను ప్రధాని కెయిర్ స్టార్మర్‌కు పంపించారు. దీనిపై ప్రధాని విచారం వ్యక్తం చేస్తూ, రేనర్ సరైన నిర్ణయం తీసుకున్నారని వ్యాఖ్యానించారు. నీతి నిజాయితీలతో రేనర్ వ్యవహరించినా, ప్రజా సేవ పట్ల అద్భుతమైన నిబద్ధతను కనబరిచినా, మంత్రుల నైతిక ప్రవర్తనా నియమావళిని ఆమె ఉల్లంఘించడం విచారకరమని స్వతంత్ర దర్యాప్తు చేపట్టిన లారీ మాగస్ వ్యాఖ్యానించారు.

## శిల్పాశెట్టి దంపతులపై లుకౌట్ నోటీసులు

**ముంబయి :** బాలీవుడ్ నటి శిల్పాశెట్టితో పాటు ఆమె భర్త, వ్యాపారవేత్త రాజ్‌కుంద్రాపై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. 60 కోట్ల రూపాయల ఆర్థిక మోసానికి సంబంధించిన చీటింగ్ కేసులో ముంబయి పోలీసు శాఖకు చెందిన ఆర్థిక నేరాల విభాగం వారిపై శుక్రవారంనాడు లుకౌట్ నోటీసులు జారీ చేసింది. శిల్పాశెట్టి దంపతులు తరచూ అంతర్జాతీయ పర్యటనలు చేపడుతున్నట్టు గుర్తించామని పోలీసులు తెలిపారు. రూ.60 కోట్ల రుణం, పెట్టుబడులకు సంబంధించి ఆర్థిక ఒప్పందం చేసుకున్న ఒక వ్యాపారవేత్తను శిల్పా దంపతులు



మోసం చేసినట్టు ఆరోపణలు ఉన్నాయని చెప్పారు. దీనిపై ఆగస్టు 14న జుహూ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైందని వివరించారు. నిందితులు దేశం విడిచివెళ్లకుండా వారిపై నిఘా ఉంచడం కోసం లుకౌట్ నోటీసులు జారీ చేస్తారు. ఫలితంగా ఇమ్మిగ్రేషన్, సరిహద్దు నియంత్రణ పాయింట్ల వద్ద అధికారులు నిందితులను అదుపులోకి తీసుకునే వీలుంటుంది. ముంబయికి చెందిన దీపక్ కొఠారీ అనే వ్యాపారవేత్త నటి శిల్పా శెట్టి, రాజ్ కుంద్రాపై తీవ్ర ఆరోపణలు చేశారు. 2015లో రాజేశ్ ఆర్య అనే వ్యక్తి ద్వారా శెట్టి కుంద్రాతో తనకు పరిచయం ఏర్పడిరదని దీపక్ ఫిర్యాదులో వివరించారు. అప్పుడు వీరు ఆన్‌లైన్ షాపింగ్ సంస్థ అయిన 'బెస్ట్ డీల్ టీవీ'కి డైరెక్టర్లుగా ఉన్నారనీ, అప్పటికి ఆ కంపెనీలో 87 శాతం కంటే ఎక్కువ వాటా ఉందని పేర్కొన్నారు. అయితే 20152023 మధ్య కాలంలో వ్యాపార విస్తరణ కోసం దీపక్ వీరికి రూ. 60.48 కోట్లు ఇవ్వగా, ఆ నిధులను శెట్టి తన వ్యక్తిగతంగా ఖర్చు చేశారని వాపోయారు.

## అక్రమార్కులకు 'మహా' సర్కారు అండ

**ముంబయి : మహారాష్ట్రలోని అధికార మహాయుతి సర్కారు ఇసుక అక్రమార్కులకు వత్తాసు పలుకుతోంది. ఇసుకను అక్రమంగా తవ్వుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి పెడుతున్నవారికి వ్యతిరేకంగా చర్యలు తీసుకున్న ఓ మహిళా ఐపీఎస్ అధికారిని.. ఆ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ బెదిరించటమే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనం. ఐపీఎస్ అధికారిణి అంజనా కృష్ణను ఫోన్లో బెదిరిస్తూ ఆయన జరిపిన మాటలకు సంబంధించిన ఓ ఆడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అయితే ఈ ఆడియోపై స్పందించిన నెటిజన్లు.. మహాసర్కారు తీరు పట్ల ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకెళ్తే.. రోడ్డు నిర్మాణం కోసం కర్మలా తాలూకాలోని కుద్దు గ్రామంలో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్టు సబ్-డివిజనల్ పోలీసు అధికారిణి అంజనా కృష్ణకు ఫిర్యాదులు అందాయి. దీనిపై చర్యలు తీసుకునేందుకు రెండ్రోజుల క్రితం ఆమె ఆ గ్రామానికి వెళ్లారు. ఈక్రమంలో కొందరు గ్రామస్థులు, స్థానిక ఎన్సీపీ కార్యకర్తలు అక్కడికి చేరుకుని అధికారులతో ఘర్షణకు దిగారు. వారిలో ఒకరు డిప్యూటీ సీఎం అజిత్ పవార్‌కు ఫోన్ చేసి ఇచ్చారు. ఇసుక తవ్వకాలకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవడం ఆపాలని పవార్ ఆమెను ఆదేశించారు. తనకు ఫోన్ చేసింది ఉపముఖ్యమంత్రే అని నమ్మకం కలగని ఆ అధికారిణి.. తన నంబర్‌కు ఒకసారి వీడియో కాల్ చేయాలని తెలిపింది. ఆమె మాటలతో ఆగ్రహానికి గురైన అజిత్ పవార్.. 'నీకు ఎంత ధైర్యం, నేను నీపై చర్యలు తీసుకుంటా.. నన్నే వీడియోకాల్ చేయమంటావా.. నన్ను చూడాలనుకుంటున్నావుగా.. నాకు వీడియో కాల్ చెరు..' అని పవార్ ఆదేశించారు.**

## టెక్ దిగ్గజాలకు ట్రంప్ 'విందు' బెదిరింపులు

అమెరికాలో పెట్టుబడులే లక్ష్యంగా పలువురు టెక్ దిగ్గజాలకు ఆ దేశ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విందు ఇచ్చారు. అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌజ్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ టెక్నాలజీ సంస్థల అధిపతులు, సిఇఓలు హాజరయ్యారు. అమెరికా ప్రథమ మహిళ మెలానియా ట్రంప్ ఆధ్వర్యంలో జరిగిన ఏఐ ఈవెంట్ అనంతరం ఈ డిన్నర్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి టిమ్‌కుక్, సుందర్ పిచారు, మార్క్ జుకర్‌బర్గ్, సత్యనాదెళ్ల వంటి పలువురు టెక్ దిగ్గజాలు హాజరయ్యారు. అయితే ట్రంప్ ఒకప్పటి మిత్రుడు, టెస్లా అధినేతకు మాత్రం ఆహ్వానం అందకపోవటం గమనార్హం. తనకు ఆహ్వానం అందిందనీ, తాను మాత్రం ఈ విందుకు హాజరు కాలేకపోయానని మస్క్ వివరణ ఇచ్చారు. విందుకు పిలిచినట్టే పిలిచి అస్సలు అమెరికాలో మీరు పెట్టిన పెట్టుబడులు ఎంత అంటూ టెక్ దిగ్గజాలను ట్రంప్ నిలదీశారు. ఇతర దేశాల్లో పెట్టిన పెట్టుబడులు ఇక చాలించాలని, స్వదేశానికి తిరిగి రావాలని ఆయన తనదైన శైలిలో బెదిరించినట్లు సమాచారం. 'టిమ్.. అమెరికాలో యాపిల్ ఎంత పెట్టుబడులు పెట్టనుంది. అది చాలా పెద్ద మొత్తమే అయి ఉంటుందని నాకు తెలుసు. ఇన్నాళ్లూ మీరు బయట (ఇతర దేశాల్లో) పెట్టుబడులు పెట్టింది చాలు. ఇక స్వదేశానికి తిరిగిరండి. ఎంత పెట్టుబడి పెడతారు?'' అని యాపిల్ సిఇఒ టిమ్ కుక్‌ను ట్రంప్ అడిగారు. దీనికి టిమ్ బదులిస్తూ.. '600 బిలియన్ డాలర్లు' అని చెప్పారు. భారత్‌లో యాపిల్ కార్యకలాపాలు నిలిపివేయాలంటూ గత కొంత కాలంగా ఆ సంస్థపై ట్రంప్ ఒత్తిడి చేస్తోన్న విషయం తెలిసిందే. అయితే భారత్‌ను టార్గెట్‌గా చేసుకొనే విదేశాల్లో పెట్టుబడులు ఆపేయాలని ట్రంప్.. టిమ్‌ను ప్రశ్నించినట్టు విశ్లేషకులు చెప్తున్నారు. ఇక ట్రంప్ అడిగిన ఇదే ప్రశ్నకు మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్ బదులిస్తూ.. '600 బిలియన్ డాలర్లు' ఇన్వెస్ట్ చేయనున్నట్టు చెప్పారు. రాబోయే రెండేండ్లలో 250 బిలియన్ డాలర్లు అమెరికాలో పెట్టుబడులు పెట్టబోతున్నామని గూగుల్ సిఇఒ సుందర్ పిచారు తెలిపారు. ఏటా 80 బిలియన్ డాలర్లు పెట్టుబడులు పెడతామని మైక్రోసాఫ్ట్ సిఇఒ సత్యనాదెళ్ల బదులిచ్చారు. టెక్ దిగ్గజాల సమాధానాలకు ట్రంప్ హర్షం వ్యక్తం చేశారు. ఈ పెట్టుబడులు చాలా పెద్ద మొత్తమనీ, వీటితో పెద్ద ఎత్తున ఉద్యోగలు సృష్టించొచ్చని వారిని అమెరికా అధ్యక్షుడు అభినందించారు.




## సమ్మెలోని కార్మికులకు బోయింగ్ బెదిరింపులు

అమెరికాలోని ప్రముఖ విమానాల తయారీ సంస్థ బోయింగ్ పరిశ్రమలో కార్మికులు తమ సమ్మెను మరింత ఉధృతంగా కొనసాగిస్తున్నారు. గత నెల 4న సమ్మె మొదలైనప్పటి నుంచి బోయింగ్ వివిధ రూపాల్లో బెదిరింపులకు దిగుతోంది. శ్రమజీవులు మాత్రం తమ సమస్యలు పరిష్కరించేదాకా సమ్మె విరమించేది లేదంటూ పోరుపంథా కొనసాగిస్తున్నారు. దీంతో సమ్మెలో ఉన్న కార్మికులందరినీ తొలగించి, వారి స్థానంలో కొత్తవారిని తీసుకుంటామని బోయింగ్ సంస్థ గురువారం ప్రకటించింది. ఈ నెల 16 నుండే కొత్త వారిని నియమిస్తామని బెదిరించింది. ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ మెషినిస్ట్స్ అండ్ ఏరోస్పేస్ వర్కర్స్ డిస్ట్రిక్ట్837 (ఐఏఎం) సంఘం నేతృత్వంలో 3500 మంది కార్మికులు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ఆరోగ్య సంరక్షణ తదితర డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్నారు. అయితే బోయింగ్ యాజమాన్యం కార్మికుల డిమాండ్లను అంగీకరించకుండా ఏకపక్షంగా నాలుగేళ్ల ఒప్పందాన్ని ప్రకటించింది. దీన్ని ఓటింగ్ ద్వారా కార్మికులు తిరస్కరించారు. తమ నైపుణ్యాన్ని, దేశ రక్షణలో తమ శ్రమను గుర్తించాలని వారు కోరుతున్నారు. ఈ సమ్మెతో అమెరికా రక్షణ వ్యవస్థకు అత్యంత కీలకమైన ఎఫ్15 యుద్ధ విమానాలు, టి7ఎ, ఎఫ్/ఎ16, ఎంక్యూ 25 డ్రోన్ రిఫ్యూలింగ్ వంటి అధునిక ఆయుధాలు, యుద్ధ విమానాల ఉత్పత్తి నిలిచిపోయింది. మరోవైపు బోయింగ్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ డాన్ గిలియన్ మాట్లాడుతూ, యూనియన్ చర్చల్లో పురోగతి లేదని, కస్టమర్ల అవసరాలను తీర్చడానికి సిబ్బంది అవసరమని, సమ్మె సమయంలోనూ ఫ్యాక్టరీలు తెరిచి ఉన్నాయని, సమ్మె చేయని ఉద్యోగులు పని చేస్తున్నారని, బోయింగ్ డిఫెన్స్ యూనిట్ గత ఏడాది 23 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని సంపాదించిందన్నారు. కొత్తవారిని నియమించేందుకు సెప్టెంబర్ 16న జాబ్ మేళా ఉంటుందని, ఇవి తాత్కాలికమైనవి కాదు సమ్మె చేస్తున్న కార్మికుల స్థానాల్లో శాశ్వతంగా నియమిస్తామని, కంపెనీ తన ప్రతిపాదనలను మార్చడానికి సిద్ధంగా ఉంది, కానీ ఆర్థిక అవసరాలకు అనుగుణంగానే మార్పులు చేస్తామని తెలిపారు.

## అమెరికాలో తగ్గిపోయిన ఉద్యోగాల వృద్ధి

అమెరికాలో ఉద్యోగాల వృద్ధి తగ్గిపోయింది. శుక్రవారం అమెరికన్ లేబర్ స్టాటిస్టిక్స్ సంస్థ వెల్లడిరచిన వివరాల ప్రకారం ఆగస్టులో నిరుద్యోగ రేటు 4.3% పెరిగింది. జులై నెలలో 73 వేల ఉద్యోగాలు నమోదుకాగా, ఆగస్టులో కేవలం 22 వేల కొత్త ఉద్యోగాలు మాత్రమే వచ్చాయి. ఆర్థిక నిపుణులు 80 వేల ఉద్యోగాలను అంచనా వేసినా, గణనీయంగా తగ్గాయి. గత సంవత్సర ఆగస్టులో 82 వేల ఉద్యోగాలను కల్పించారు. గత మూడు నెలల కాలంలో సగటున 29 వేల ఉద్యోగాలు మాత్రమే నమోదయ్యాయి. ట్రంప్ టారిఫ్‌ల ప్రభావంతో అమెరికన్ కార్మిక మార్కెట్ వేగంగా దిగజారుతుంది. జులైలో వచ్చిన ఉద్యోగాలు అత్యధిక శాతం ఆరోగ్య, సామాజిక, సేవా రంగాల్లోనివే. మే, జూన్ నెలల్లో సైతం అంచనాలకు అనుగుణంగా ఉద్యోగాల కల్పన నమోదుకాలేదు. ఈ నివేదిక నేపథ్యంలో వడ్డీ రేట్లు తగ్గుతాయని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. వడ్డీ రేట్లు తగ్గించాలని ట్రంప్ ఒత్తిడి చేసినా సెంట్రల్ బ్యాంక్ పెంచలేదు. జులై నెలకి సంబంధించిన నిరుద్యోగ వివరాలను ప్రకటించినందుకు అప్పటి బిఎల్ఎస్ అధిపతి మెక్ ఎంటార్ఫర్‌ను ట్రంప్ తొలగించిన సంగతి తెలిసిందే. అయితే పెరిగిన వడ్డీ రేట్లు, దిగుమతి సుంకాలు, వలసలపై కఠిన చర్యల కారణంగా అమెరికన్ ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి కూరుకుపోవడాన్ని సూచిస్తుందని, ట్రంప్ టారిఫ్ విధానాలు వల్ల కంపెనీలు నియామకాలు తగ్గించటంతో పాటు, లే ఆఫ్‌లు ప్రకటిస్తున్నాయని, ఆర్థిక అనిశ్చితి పెరుగుతుందని విశ్లేషకులు భావిస్తేన్నారు. అధ్యక్షుడు ట్రంప్ గురువారం ప్రముఖ కంపెనీల సిఇఒలతో సమావేశమైన అనంతరం బ్యూరో ఆఫ్ లేబర్ స్టాటిస్టిక్స్ (బిఎల్ఎస్) ఈ రిపోర్ట్‌ను వెల్లడిరచడం గమనార్హం.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# మిరాయ్ మేజిక్ జరగాల్సిందే



కొత్త శుక్రవారం వచ్చేసింది. వేర్వేరు అంచనాలు, ప్రమోషన్లతో వచ్చిన మూడు సినిమాల జాతకం తేలిపోయింది. కమర్షియల్ గా ఎవరి స్థాయి ఏంటనేది సోమవారానికి క్లారిటీ వస్తుంది కానీ హిట్టు స్టేటస్ పక్కనపెడితే వీటిలో ఏదీ ఓ ముప్పై కోట్ల షేర్ వసూలు చేయడం జరగని పనిలా కనిపిస్తోంది. సరే వీటి జాతకం ఎలా ఉన్నా సరిగ్గా వారం రోజుల తర్వాత రాబోతున్న మిరాయ్ మీద థియేటర్ వ్యవస్థ బోలెడు ఆశలు పెట్టుకుంది. తేజ సజ్జ హీరో కావడంతో ఫ్యామిలీ ఆడియన్స్ తో పాటు చిన్న పిల్లల్లో సైతం ఇది ఆసక్తి రేపుతోంది. చాలా రీజనబుల్ బిజినెస్ జరుపుకున్న మిరాయ్ హిట్టయితే బయ్యర్లకు భారీ లాభాలొస్తాయి. అదే రోజు బెల్లంకొండ సాయిశ్రీనివాస్ కిష్కిందపురి ఉంది కానీ హారర్ ఎలిమెంట్స్ వల్ల సెన్సార్ బోర్డు ఏ సర్టిఫికెట్ ఇచ్చింది. సో మిరాయ్ కు అది కూడా అడ్వాంటేజ్ కానుంది. సెప్టెంబర్ 25 ఓజి వచ్చేదాకా మిరాయ్ కు పదమూడు రోజులు ఓపెన్ గ్రౌండ్ దొరుకుతుంది. హనుమాన్ స్థాయి బ్లాక్ బస్టర్ దక్కుతుందని తేజ సజ్జ బలంగా నమ్ముతున్నాడు. పైగా ఇతర భాషల్లో బడా సంస్థలు డిస్ట్రిబ్యూట్ చేస్తుండటంతో ఇండియా వైడ్ పెద్ద రిలీజ్ అందుకుంటోంది. బొమ్మ క్లిక్ అయితే మాత్రం తేజ సజ్జ రేంజ్ పెరగడంతో పాటు విలన్ గా మంచు మనోజ్ ఇతర బాషల డైరెక్టర్ల దృష్టిలో పడతాడు. టాలీవుడ్ కున్న ప్రధాన సమస్య గత రెండు మూడు నెలలుగా వారాల తరబడి హౌస్ ఫుల్స్ చేయిస్తున్న సినిమా ఒక్కటి రాలేదు. ఏదైనా సరే వీకెండ్ హడావిడికి పరిమితమై తర్వాత నెమ్మదిస్తున్నాయి. కానీ మిరాయ్ అలా కాకూడదు. సరైన మూవీ లేదనే కారణంతోనే జనాలు థియేటర్ల వైపు పెద్దగా చూడటం లేదు. ఇప్పుడొకటి వస్తోందంటే ఖచ్చితంగా జనాలు కదులుతారు. కాకపోతే ఆ స్థాయి టాక్ ని మిరాయ్ తెచ్చుకోవాలి. మహావీర్ నరసింహ తప్ప ఈ మధ్య కాలంలో పబ్లిక్ కళకళలాడుతూ థియేటర్లలో కనిపించిన దాఖలాలు లేవు. మరి మిరాయ్ కనక ఆ లోటు తీరిస్తే మంచిదే. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీకి ఈ హిట్టు చాలా ముఖ్యం.

# తెలుగువారిని మెప్పించలేకపోయిన 'మదరాసి'

శివకార్తికేయన్ హీరోగా రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా దర్శకుడు మురుగదాస్ తెరకెక్కించిన సినిమా 'మదరాసి'. 'అమరన్' విజయన్ తర్వాత శివకార్తికేయన్ నటించిన ఈ సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. తన చిన్నతనంలోనే ఒక ప్రమాదంలో కుటుంబం మొత్తాన్ని పోగొట్టుకున్న రఘు (శివ కార్తికేయన్) ఆ ఘటనతో డిల్యూషన్ సింద్రోమ్ కి గురవుతాడు. ఇలా 16 ఏళ్ళు చికిత్స తర్వాత తన జీవితంలోకి మాలతి (రుక్మిణి వసంత్) వస్తుంది. ఇంకో పక్క ఇద్దరు ఫ్రెండ్స్ చిరాగ్ (షబ్బీర్), విరాట్ (విద్యుత్ జమ్వాల్) లు మొత్తం చెన్నైని గన్స్‌తో నింపాలని పెద్ద ప్లాన్ చేస్తారు. ఇది ఎన్ఐఏ వారికి పెద్ద సవాలుగా మారుతుంది. ఎన్ఐఏ అధికారి ప్రేమ్ (బిజూ మీనన్) తన బృందంతో ఆ గన్ కల్చర్ ని ఆపాలని ప్రయత్నించే మిషన్ లోకి రఘు ఎలా ప్రవేశించాడు? తన ప్రేయసి కోసం రఘు ఏం చేశాడు? ఈ గన్ మాఫియా వెనుక ఉన్నది ఎవరు? గన్ లోడ్ బయటకి రాకుండా ఆపారా, లేదా అనేది మిగతా కథ. కథనం, విశ్లేషణ: దర్శకుడు మురుగదాస్ నుంచి చాలా కాలం తర్వాత వచ్చిన ఈ సినిమాలో కొత్తదనం కనిపించదు. ఈ మధ్య కాలంలో పలు సినిమాల్లో చూపిస్తున్న గన్ కల్చర్ కాన్సెప్ట్ కి తన స్టైల్ హీరో పాత్ర, దానికో లోపం పెట్టి అక్కడక్కడా తన పాత సినిమాల స్టైల్ లోనే కథనం నడిపించారు. సినిమాలో యాక్షన్, ఎమోషనల్ పార్ట్ కూడా పెద్దగా ఆకట్టుకోలేదు. అలాగే సెకాండ ఫ్‌లో కథనం కూడా అంత ఆసక్తికరంగా సాగలేదు. ఈ సినిమాను శివ కార్తికేయన్, రుక్మిణీ వసంత్ తమ నటనతో కాస్తంత నిలబెట్టే ప్రయత్నం చేశారు. ఇక సినిమా ప్రారంభం మొదలు, ముగింపు వరకూ ప్రతి సన్నివేశం కృత్రిమంగా ఉంది. కొత్తదనం ఉన్న సీన్ ఒక్కటంటే ఒక్కటి కూడా లేదు. అయితే మొత్తానికి 'మదరాసి' తెలుగువారిని మెప్పించలేకపోయాడు.



# అంతర్జాతీయ స్థాయిలో నాలుగు అవార్డులు

'అర్జున్ చక్రవర్తి'ని విజువల్ ట్రీట్‌గా తెరకెక్కించిన కెమెరామెన్ జగదీష్ చీకటి పనితనం గురించి ప్రస్తుతం అందరూ మాట్లాడుకుంటున్నారు. ఈ చిత్రానికిగానూ ఎన్నో అంతర్జాతీయ వేడుకల్లో బెస్ట్ సినిమాటోగ్రాఫర్‌గా ఆయన అవార్డుల్ని అందుకున్నారు. ఈ సందర్భంగా జగదీష్ చీకటి మీడియాతో మాట్లాడుతూ ''హాలీవుడ్ స్థాయి కి ధీటుగా మనం సినిమాలు తీస్తున్నాం. మా 'అర్జున్ చక్రవర్తి' కూడా అదే స్థాయిలో ఉంటుంది. ఆ స్థాయి లుక్ వచ్చేందుకు నేచురల్ లైటింగ్‌లోనే షూటింగ్ చేశాం. ఇక 'అర్జున్ చక్రవర్తి' షూటింగ్ కోసం మంచు కురిసే ప్రాంతం కదా అని కాశ్మీర్ కు వెళ్లాం. కానీ మేం వెళ్లినప్పుడు అక్కడ మంచు పడటం లేదు. దీంతో అక్కడే మంచు కురిసే వరకు ఎదురుచూశాం. అలా చివరకు మైనస్ 8 డిగ్రీల వరకు వెళ్లింది. దీంతో విజువల్స్ అద్భుతంగా వచ్చాయి. క్లైమాక్స్ ఎపిసోడ్‌కి చాలా కష్టపడాల్సి వచ్చింది. 'అర్జున చక్రవర్తి'కి గానూ అంతర్జాతీయ స్థాయిలో నాకు నాలుగు అవార్డులు, కోలీవుడ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, కేరవ్యాన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, మోకో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, ది బుద్దా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డులు వచ్చాయి''అని అన్నారు.






# యూనిక్ యాక్షన్ థ్రిల్లర్

జెడి చక్రవర్తి, నరేష్ అగస్త్య, సీరత్ కపూర్ లీడ్ రోల్స్‌లో నటిస్తున్న యూనిక్ యాక్షన్ థ్రిల్లర్ 'జాతస్య మరణం ధ్రువం'. శ్రవణ్ జొన్నాడ రచన, దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని త్రిష సమర్పకురాలిగా సురక్ష్ బ్యానర్‌పై మల్కాపురం శివ కుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో ప్రీతీ జంఘియానీ రీఎంట్రీ ఇస్తోంది. తాజాగా మేకర్స్ టీజర్ లాంచ్ చేశారు. ఈ ఈవెంట్‌లో జె.డి చక్రవర్తి మాట్లాడుతూ ''నిర్మాత శివకుమార్ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్‌ని ముంబైలో ఎక్కడ రాజీపడకుండా చేస్తున్నారు. సీరత్ మంచి డాన్సర్, కొరియోగ్రాఫర్, సింగర్. ఈ సినిమాలో తన నటన అందరికీ నచ్చుతుంది. డైరెక్టర్ శ్రవణ్ సినిమాని చాలా అద్భుతంగా తీశాడు''అని అన్నారు. డైరెక్టర్ శ్రవణ్ మాట్లాడుతూ ''సినిమాలో ఇన్వెస్టిగేషన్ పార్ట్ అద్భుతంగా ఉంటుంది. జేడీ చక్రవర్తి, నరేష్ అగస్త్య, సీరత్ కపూర్, నిర్మాత శివకుమార్ చాలా సపోర్ట్ చేశారు''అని తెలిపారు. నిర్మాత మల్కాపురం శివ కుమార్ మాట్లాడుతూ ''కొత్త డైరెక్టర్ శ్రవణ్ చెప్పిన కాన్సెప్ట్ అద్భుతంగా అనిపించింది. జెడి చక్రవర్తి, నరేష్, శరత్ కపూర్ మా బ్యానర్‌లో వర్క్ చేస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఇది పాన్ ఇండియా మూవీ''అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హీరో నరేష్ అగస్త్య, సీరత్ కపూర్ పాల్గొన్నారు.

# పవర్‌ఫుల్‌గా 'జిల్ జిల్..' సాంగ్

తెలుగు ప్రేక్షకులను అలరించిన 'మార్గన్' విజయం తర్వాత విజయ్ ఆంటోనీ 'భద్రకాళి' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. అరుణ్ ప్రభు దర్శకత్వం వహించగా, సర్వంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్‌పై రామాంజ నేయులు జవ్వాజీ నిర్మించారు. విజయ్ ఆంటోనీ ఫిల్మ్ కార్పొరేషన్, మీరా విజయ్ ఆంటోనీ సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, ఫస్ట్ సింగిల్‌కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. మేకర్స్ తాజాగా 'జిల్ జిల్..' అంటూ సాగే సాంగ్‌ని రిలీజ్ చేశారు. విజయ్ ఆంటోని పవర్‌ఫుల్ సాంగ్‌గా దీన్ని కంపోజ్ చేశారు. భోలే షావలి స్వయంగా రాసి, పాడిన ఈ సాంగ్ హై ఎనర్జీతో ఆకట్టుకుంది. సాంగ్‌లోని పవర్ ప్యాక్డ్ విజువల్స్ సినిమాపై చాలా క్యూరియాసిటీ పెంచాయి. తెలుగులో 'మార్గన్' సినిమాను విజయం దిశగా నడిపించిన ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ సినిమాను కూడా తెలుగులో రిలీజ్ చేస్తోంది. రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా సపోర్ట్ కూడా ఉండడంతో ప్రాజెక్ట్‌పై మంచి బజ్ ఉంది. ఈ సినిమా ఈనెల 19న రిలీజ్ కానుంది. 'భిన్న కథలతో మా కథానాయకుడు విజయ్ ఆంటోనీ ఎప్పుడూ ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేస్తున్నారు. ఆ కోవలోనే ఈ సినిమా కూడా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది' అని మేకర్స్ తెలిపారు.



# చరిత్ర సృష్టించబోతున్నాం

నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబోలో రాబోతున్న భారీ ప్రాజెక్ట్ 'అఖండ2'. ఈ మూవీ బ్లాక్ బస్టర్ హిట్ 'అఖండ'కు సీక్వెల్‌గా తెరకెక్కుతోంది. ఈ సినిమాలో సంయుక్తా మీనన్, హర్షల్ కీలక పాత్రలో నటిస్తుండగా.. ఆది పినిశెట్టి విలన్‌గా కనిపించబోతున్నాడు. ఈ మూవీని బాలయ్య చిన్న కూతురు 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై ఎం తేజస్విని సమర్పణలో రామ్ అచంట, గోపీ అచంట నిర్మిస్తున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ సినిమాను తమన్ సంగీతం అందిస్తున్నారు. అయితే ఈ చిత్రం సెప్టెంబర్ 25న విడుదల కావాల్సి ఉండగా.. పలు కారణాల వల్ల వాయిదా పడిరది. కానీ కొత్త రిలీజ్ డేట్‌ను మాత్రం చిత్రబృందం వెల్లడిరచకపోవడంతో అసలు ఈ మూవీ ఇప్పట్లో వస్తుందా? లేదా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇక అఖండ2 ఎప్పుడెప్పుడు వస్తుందా? అని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈక్రమంలో.. తాజాగా, నందమూరి బాలయ్య ఓ కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాదే ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు వెల్లడిరచారు. ''అఖండ2 సినిమా డిసెంబర్‌లో విడుదల కాబోతుంది. తమన్ సంగీతంపై మరింత సమయం కావాలని అన్నాడు. అఖండ విడుదల సమయంలో సౌండ్ ప్రూఫర్లు బద్దలయ్యాయి. కానీ అఖండ2 డిసెంబర్‌లో దానికంటే 50 రేట్లు పెద్దగా ఉంటుంది. త్వరలో కచ్చితమైన రిలీజ్ తేదీని ప్రకటిస్తాము. అభిమానుల అంచనాలను మించి ఉంటుంది. బాక్సాఫీసులో చరిత్ర సృష్టించబోతున్నాము''అని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో ఈ విషయం తెలుసుకున్న అభిమానులు కొందరు సంతోష పడుతుంటే.. మరికొందరు మాత్రం కాపీ చేసే సంగీతానికి ఇంకెన్ని రోజులు సమయం తీసుకుంటావని తమన్‌ను తిట్టిపోస్తున్నారు.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in